# తిరుపతి - చిత్తూరు వార్త

తిరుపతి, చిత్తూరు జిల్లాలు, ◆ శుక్రవారం 9 ఫిబ్రవరి 2024


### భగవంతుని చేరాలంటే ముందు
## ముందు పరమభక్తుల అనుగ్రహం అవసరం
### -విద్యాప్రసన్నతీర్థస్వామి



తిరుమల, ఫిబ్రవరి 8ప్రభాతవార్తప్రతినిధి: భగవంతుని చేరాలంటే ముందు ఆయన పరమభక్తుల అనుగ్రహం అవసరమని పురాణాలు పేర్కొంటున్నాయని, ఈ కోవకు చెందిన పరమ భక్తుడు పురందరదాసు అని కుక్కేసుబ్రమణ్య మఠాధిపతి విద్యాప్రసన్న తీర్థస్వామి అన్నారు. పురందరదాసు ఆరాధన మహోత్సవాలులో భాగంగా గురువారం తిరుమల ఆస్థానమండపంలో గోష్టిగానం జరిగింది.

### 11న పిసిసి అధ్యక్షురాలు
## షర్మిల నగరికి రాక



చిత్తూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల 11వ తేదీన నగరిలో పర్యటించనున్నారు. పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని అక్కడి నుండి నగరిలో జరిగే రోడ్ షో, బహిరంగ సభల్లో పాల్గొనడానికి బయలుదేరి వెళ్తారు. పిసిసి అధ్యక్షురాలు షర్మిలతో పాటు సిడబ్ల్యుసి సభ్యులు, ఎఐసిసి సభ్యులు, ఎపిసిసి సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఈ మేరకు పిసిసి అధ్యక్షురాలు షర్మిల పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషి చేయాలని ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ ఓ ప్రకటనలో తెలిపారు.

### రాజు బలవంతుడైతే
## శత్రువులు ఒక్కటవుతారు
### -సంక్షేమప్రదాత సిఎం జగన్
### -గంగమ్మ ఆలయంలో హోంమంత్రి వనిత



తిరుపతి, ఫిబ్రవరి 8ప్రభాతవార్త: గత ఐదేళ్ళలో వైసిపి ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో ప్రతి కుటుంబా నికి సంక్షేమ పథకాలు అందించి, సంక్షేమ ప్రదాతగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత అన్నారు. రాజు బలవంతుడైతే శత్రువులు ఒక్కటవుతారనే నానుడిగా రాష్ట్రం లో నేడు రాజకీయపార్టీల నేతల వ్యవహారం మారిందని ప్రతిపక్షాలపై విమర్శించారు. రాష్ట్రంలో పోలీసు శాఖ సిబ్బందికి బకాయిలు త్వరలోనే చెల్లిస్తామని ఆమె వెల్లడించారు. గురువారం రాత్రి తిరుపతికి వచ్చిన హోమ్‌మంత్రి తానేటివనిత తిరుపతి తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. అంతకు ముందు ఆమె ఆలయంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

### మరో భారీ రాకెట్ ప్రయోగానికి
## సిద్ధమవుతున్న షార్



రాకెట్ తయారీకి అతిపెద్ద స్ట్రాపాన్ బూస్టర్‌ను తరలిస్తున్న దృశ్యం

- ఈ ఏడాది వరుసగా రెండవ ప్రయోగం
- జిఎస్ఎల్వి ఎఫ్14 రాకెట్ ద్వారా ఇన్‌శాట్ 3డిఎస్ అంతరిక్షంలోకి
- అనుసంధానం పనులు వేగవంతం- షార్ శాస్త్రవేత్తలు బిజీ



జిఎస్ఎల్వి ఎఫ్14 ఉష్ణకవచం మధ్యలో ఇన్‌శాట్ 3డిఎస్ ఉపగ్రహం

శ్రీహరికోట (తడ) ఫిబ్రవరి 8 ప్రభాతవార్త శ్రీహరికోట మరో భారీ రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతోంది. జిఎస్ఎల్వి ఎఫ్14 రాకెట్‌ను ఈ నెల 17న సాయంత్రం 5.30 గంటలకు ప్రయోగిస్తున్నారు. గురువారం ఇస్రో అధికారికంగా ప్రయోగ సమయాన్ని నిర్ధారించింది. ఈ రాకెట్ ద్వారా భారత సమాచార ఉపగ్రహం ఇన్‌శాట్ 3డిఎస్‌ను అంతరిక్షంలోకి పంపిస్తున్నారు. జిఎస్ఎల్వి సిరీస్‌లో ఇది 16వ ప్రయోగం. జియో సింక్రనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ ద్వారా గతంలోను అనేక భారీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి శాస్త్రవేత్తలు ప్రవేశపెట్టారు. ఈ సారి కూడా 2275 కిలోల బరువు ఉన్న వాతావరణ పరిస్థితులను పసిగట్టే సామర్ధ్యం కలిగిన ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. గత నెల 26న ఈ ప్రయోగం జరగాల్సి ఉన్నప్పటికీ బెంగళూరు నుంచి ఉపగ్రహం ఇక్కడికి తరలించడంలో జాప్యం జరగడం, ఇతర కార్యక్రమాల వల్ల ఈ నెల 17కి వాయిదా పడింది. సమాచార వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి ఈ ఉపగ్రహాన్ని ఇస్రో రూపొందించగా శ్రీహరికోట శాస్త్రవేత్తల పనితీరుకు నిదర్శనంగా జిఎస్ఎల్వి ఎఫ్14 రాకెట్‌ను రూపొందించారు. ఈ రాకెట్‌లో క్రింది భాగాన అతి పెద్దవైన స్ట్రాపాన్ బూస్టర్లను అమర్చారు. శీర్షభాగాన ఉష్ణకవచంలో ఉపగ్రహాన్ని చేర్చి ప్రయోగానికి ముందు జరిగే వివిధ పరీక్షలను చేపడుతున్నారు. షార్ నుంచి నెలకో రాకెట్‌ను ప్రయోగిస్తామన్న ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ఆ దిశగా అడుగులు వేస్తూ జనవరి 1న పిఎస్ఎల్వి ప్రయోగం, ఫిబ్రవరి 17న జిఎస్ఎల్వి ప్రయోగాలు జరుపుతున్నారు.

## జంగాలపల్లి ఆశలు గల్లంతు
### - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు వైకాపాలో దక్కని రాజ్యసభ సభ్యత్వం

చిత్తూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రాజ్యసభ సభ్యత్వం ఆశలు గల్లంతు అయ్యాయి. చిత్తూరు వైకాపా సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు ప్రస్తుతం రాజ్యసభకు మూడు స్థానాలకు జరిగే ఎన్నికల్లో అభ్యర్థిత్వం ఖరారు చేస్తామని వైకాపా అధిష్టానం హామీ ఇచ్చి చిత్తూరు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా అర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందంరెడ్డిని వైకాపా అధిష్టానం ఖరారు చేసింది. వైకాపా అధిష్టానం తనను అసెంబ్లీ నుండి పార్లమెంటుకు పదోన్నతి కల్పిస్తుండటంతో సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సైతం అధిష్టానం నిర్ణయంకు కట్టుబడి మిన్నకుండిపోయారు. అయితే ప్రస్తుతం వైకాపా అధిష్టానం విడుదల చేసిన వైకాపా రాజ్యసభ అభ్యర్థుల జాబితాలో చిత్తూరు వైకాపా సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేరు లేకపోవడంతో ఆయన ఖంగు తిన్నారు. వైకాపాలో రాయలసీమ జిల్లాల్లో బలిజ సామాజిక వర్గానికి చెందిన ఆరణి శ్రీనివాసులు ఒక్కరు మాత్రమే ఎమ్మెల్యేగా వుండటంతో వైకాపా అధిష్టానం ఆ సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి మరోసారి ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం కల్పిస్తుందని పార్టీలోని నాయకులు భావించారు. అయితే పార్టీ అధిష్టానం అందరి అంచనాలను తలకిందలు చేస్తూ సిట్టింగ్ ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులుకు రాజ్యసభ సభ్యత్వం ఇస్తామని హామీ ఇచ్చి చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జిగా అర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి పేరును ఖరారు చేసింది. పార్టీ అధిష్టానం తనను అసెంబ్లీ నుండి రాజ్యసభకు నామినేట్ చేస్తోందని రాజ్యసభ సభ్యుడిగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందవచ్చునని భావించి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మిన్నకుండిపోయారు. అ క్రమంలో వైకాపా అధిష్టానం గురువారం విడుదల చేసిన ముగ్గురు రాజ్యసభ అభ్యర్థుల పేర్ల జాబితాలో చిత్తూరు సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేరు లేకపోవడంతో ఆయన పార్లమెంటుకు వెళ్ళే ఆశలు గల్లంతు అయ్యాయి. అధిష్టానం సమీకరణలను బేరిజు వేసి రాజ్యసభ అభ్యర్థులను ఎంపిక చేయడంతో చిత్తూరు సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీనివాసులు అభ్యర్థిత్వం గల్లంతు అయినట్లు తెలుస్తోంది.

## అమ్మవారి అనుగ్రహం ఆలయ నిర్మాణం
### - మంత్రి రోజా



దేశమ్మ ఆలయంలో కుంభాభిషేకంలో పాల్గొన్న మంత్రి, తదితరులు

నగరి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: పట్టణ పరిధిలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న నేత్ర ప్రదాయణి దేశమ్మ ఆలయ కుంభాభిషేకోత్సవంలో 4వ రోజు గురువారం క్షీరతత్పరణం, బింబసంస్కారం, కుంభ కలశపూజ, చతుర్విదహోమ పూజలు జరిగాయి. మంత్రి రోజా రోజా ఈ పూజలకు హాజరు కాగా ఆలయ కమిటీ ఛైర్మన్ వేణుబాబు, ఈవో రామచంద్రయ్య ఆమెకు కుంభ కలశ ఆహ్వానం పలికారు. మంత్రితో పాటు పాల్గొన్న మున్సిపల్‌ఛైర్మన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులకు ఆలయ కమిటీ ఛైర్మన్ అమ్మవారి కండువాలను వేసి గౌరవ ఆహ్వానం పలికారు. భక్తిశ్రద్ధలతో పూజలకు హాజరైన మంత్రి చతుర్విద హోమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం బింబ సంస్కారపూజల్లో పాల్గొని ఆలయంలో ప్రతిష్టించి పరివారదేవతా బింబాలను గోపుర కలశాలను ఆలయ ప్రాంగణానికి తెచ్చి పూజించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అమ్మవారి చలువతో రెండు సార్లు నగరి నియోజకవర్గం నుంచి గెలుపొందానన్నారు. అమ్మవారి అనుగ్రహం తనకు ఉన్నందునే ఆమె ఆలయాన్ని నిర్మించే మహత్కార్యాన్ని తన ద్వారా చేయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘం, వైస్ ఛైర్మన్‌లు బాలన్, వెంకటరత్నం, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

### నేషనల్ హైవేకి భూ సేకరణ ప్రక్రియ
## వేగవంతం చేయండి
### జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీషా



జాతీయ రహదారి భూ సేకరణ పై అధికారులతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ లక్ష్మీషా

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త జాతీయ రహదారికి సంబంధించిన భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రవాణా, రహదారులు, భవనాలు సెక్రటరీ ప్రద్యుమ్న అమరావతి నుండి గురువారం వర్చువల్ విధానంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న జాతీయ రహదారుల కోసం అవసరమయ్యే ప్రభుత్వ భూములు, డికెటి భూములు, పట్టా భూములు అవసరం మేరకు విస్తీర్ణాన్ని సేకరించాలని సూచించారు. కలెక్టర్‌లు వారి జిల్లాలలో ఎన్ని ఎన్‌హెచ్‌ఎఐ ప్రాజెక్టులు ఏర్పాటు అవుతున్నవి అనే అంశం పై దృష్టి పెట్టి భూ సేకరణ నోటిఫికేషన్ ఇవ్వడం, అవార్డ్స్ పాస్ చేయడం కంపెన్సేషన్ అందివ్వడం, భూమిని పొసెషన్ వరకు అన్ని స్థాయిలలో క్యాపిటల్ 3ఎ, 3డి, 3జి చివరి స్టేజి వరకు త్వరితగతిన చర్యలు తతీసుకుని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తిరుపతి కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీషా మాట్లాడుతూ జిల్లాలోని ఆరు ఎన్‌హెచ్‌ఎఐ ప్రాజెక్టులకు భూసేకరణ వివిధ స్టేజిలో ఉన్నదని, అవార్డు పాస్ చేయడం కాంపెన్సేషన్ అందజేయడం తదితర అంశాలు వేగవంతం చేస్తామని తెలిపారు. ఈ వర్చువల్ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డికె శుభం బన్సల్, సంబంధిత రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## విషాదం
### బెలూన్ కోసం మృత్యువాతపడ్డ బాలుడు



మృతుడు రంజిత్ (ఫైల్‌ఫోటో )

గంగవరం, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : గాలిలో ఎగిరే బెలూన్ పట్టుకోవడం కోసం ప్రయత్నించి ఓ బాలుడు మృత్యువాత పడిన హృదయ విదారక సంఘటన గురువారం మండలంలో వెలుగు చూసింది. గంగవరం అర్బన్ సిఐ చిన్నగోవిందు కథనం మేరకు వివరాలిలా.. మండలంలోని గండ్రాజుపల్లె పంచాయతీ అనంతపురం గ్రామానికి చెందిన బలిజ జయరామ్, గాయత్రి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు రంజిత్‌కుమార్(9)అనే బాలుడు నాలుగు రోడ్ల సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాల నందు 4వ తరగతి చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం పాఠశాల నుండి ఇంటికివచ్చిన రంజిత్ ఇంటి ముందర సరదాగా బెలూన్‌తో ఆడుకుంటుండగా బెలూన్ గాలిలో ఎగిరి ఇంటి ముందు ఉన్న పశువుల కొట్టంపై చిక్కుకోవడంతో రంజిత్ బెలూన్ తీసుకోవడం కోసం ఇంటి ఆవరణలో ఉన్న ఓ ఇనుప కమ్మితో బెలూన్‌ను లాగుతుండడంతో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న 11కెవి విద్యుత్ వైర్లకు తగలడంతో రంజిత్ విద్యుత్ షాక్ గురై శరీరం కాలిపోయి తీవ్ర గాయాలతో కిందకుపడిపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నగరంలోని విక్టోరియా ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఈ రోజు ఉదయం బాలుడు మృతి చెందినట్లు సిఐ పేర్కొన్నారు. మృతి చెందిన బాలుడి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## సీఎంచే శ్రీవరసిద్ది వినాయక వైభవం,ఉపాసన విధానము గ్రంథం ఆవిష్కరణ



కాణిపాకం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి వారి ప్రాశస్త్యం, పూజా విధానముపై రచించిన శ్రీవరసిద్ది వినాయక వైభవం, ఉపాసన విధానము గ్రంధంను రాష్ట్ర సీఎం జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. కాణిపాకం ఆలయ ప్రాశస్థం, స్వామివారి పూజా విధానముపై విజయవాడకు చెందిన లక్ష్మీ సీతారాంజనేయులు శర్మ "శ్రీవరసిద్ది వినాయక వైభవం, ఉపాసన విధానము" పేరిట గ్రంధంకు రచించారు. తొలి ముద్రణ జరగడంతో గురువారం అమరావతి రాష్ట్ర సచివాలయంలోని సీఎం కార్యాలయంలో సీఎం జగన్ చేతుల మీదుగా గ్రంధంను ఆవిష్కరించారు. దేవాదాయమంత్రి కొట్టు సత్యనారాయణ, కమీషనర్ ఎస్.సత్యనారాయణ, కాణి పాకం ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, గ్రంధ పరిశోధకులు డాక్టర్ శ్రిష్టి సీతా రామాం జనేయశర్మ

### చివరి అసెంబ్లీ సమావేశానికి
## హాజరయ్యానన్న సంతృప్తి కలిగింది
### ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి



వెంకటగిరి, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త చివరి అసెంబ్లీ సమావేశాలకి తాను హాజరయ్యానన్న సంతృప్తి కలిగిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి తెలి పారు. తనపై అనర్హత వేటు వేయించాలని ప్రభుత్వం ప్రయత్నించిందని తెలిపారు. వైసిపి పార్టీ నుండి తాను బయటకు లేదని వారి తప్పించారని తెలిపారు. జిల్లాలో జరుగుతున్న అన్ని రకాల మాఫియా గురించి ప్రశ్నించినందుకు తనను తప్పించినట్లు చెప్పారు. తనపై అనర్హత వేటు వేసేందుకు మూడుసార్లు అసెంబ్లీ స్పీకర్ హాజరమ్మన్నారని తాను హాజరైనట్లు తెలిపారు. ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాద్ రావు చివరిసారిగా గురువారం విచారించినట్లు తెలిపారు. ప్రతిపక్షానికి బలం లేకుండా చేసేందుకు తనపై వేయాలని ప్రభుత్వం ప్రయత్నించిందని తెలిపారు. చివరి అసెంబ్లీ సమావేశాలకు హాజర అవతారం లేదు అనుకున్నానని హాజరైన సంతృప్తి మిగిలిందని తెలిపారు.

### నిరుద్యోగ ఉపాధ్యాయుల
## ఆశలు ఆవిరి
### డిఎస్సీ-2024 ద్వారా కేవలం 336 పోస్టులు మాత్రమే భర్తీ

చిత్తూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఐదేళ్ళ పాటు అధికారంలో వున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థుల ఆశలను ఊరించి వారి ఆశలను చివరికి గల్లంతు చేసింది. డిఎస్సీ-2024 నోటిఫికేషన్ ద్వారా ఉపాధ్యాయ ఖాళీ పోస్టుల భర్తీకి కంటి తుడుపు చర్యకు శ్రీకారం చుట్టిందని ఆరోపణలు మిన్నంటుతున్నాయి. రాష్ట్రంలో వైకాపా అధికారంలోకి రాక ముందు ఎన్నికల హామీలో భాగంగా తాము అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది డిఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలో ఐదేళ్ళపాటు అధికారంలో వున్న వైకాపా ప్రభుత్వం ఏ ఒక్క ఏడాది ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం డిఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయలేదు. ఈ క్రమంలో ప్రస్తుతం ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం జారీ చేసిన డిఎస్సీ-2024 నోటిఫికేషన్ ద్వారా భారీగా ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ అవుతాయని నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు ఆశలు పెట్టుకొన్నారు. అయితే వారి ఆశలను పూర్తి స్థాయిలో గల్లంతు చేస్తూ ప్రభుత్వం పరిమిత స్థాయిలో డిఎస్సీ-2024 ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసి ఎన్నికల్లో లబ్దిపొందడానికి కంటి తడుపు చర్యకు శ్రీకారం చుట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా వుండగా ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో లబ్దిపొందడానికి కంటి తుడుపు చర్యగా 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డిఎస్సీ-2024 నోటిఫికేషన్‌ను జారీ చేసింది. జిల్లాలో డిఎస్సీ-2024 ద్వారా కేవలం 336 ఉపాధ్యాయ పోస్టులు మాత్రమే భర్తీ కానున్నాయి.

## క్షేత్ర పాలకునికి షోడషాభిషేకాలు : బాబాకు విశేష పూజలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త దివ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో వెలసిన దేవుళ్ళుకు భక్తులు మొక్కులు తీర్చుకుంటూ భక్తి పారవశ్యంతో పులకిస్తున్నారు. ఈ నేపధ్యంలో గురుదక్షిణామూర్తికి షోడషాభిషేకాలు, పట్టణంలోని రెండు చోట్ల వెలసిన షిరిడి సాయి బాబా ఆలయాల్లో బాబాకు విశేష పూజలు, పారాయణం చేస్తూ భక్తి తో మొక్కుకున్నారు. ఈ నేపధ్యంలో కర్నాలవీధిలోనూ, మద్రాసు రోడ్డులో వెలసిన షిరిడి బాబా ఆలయాల్లో భక్తులు కిక్కిరిసిపోయారు. ఇక్కడ అనాధలకు వితరణలు చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన పరివార దేవతలకు ఒక్కొక్క రోజు ఒక్కొక్క దేవునికి పూజలు, విశేష అభిషేకాలు నిర్వహిస్తున్నారు. పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్న భోళాశంకరుని సన్నిధికి భక్తులు తండోపతండాలుగా కదలి వస్తున్నారు. నిత్యపూజలతో విరాలజిల్లుతున్న ఆలయంలో అడుగుపెట్టి పునీతులౌతున్నారు. కాశిలో మునక శ్రీకాళహస్తిలో అడుగుపెట్టడం ముక్తికి మార్గంగా భావిస్తున్నారు. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి ప్రదాన ఆలయం కంచుగడప వద్దకు అడుగుపెట్టగానే గురువు దర్శనభాగ్యం లభిస్తుంది.

**చదువుల రేడుకు విశేషాభిషేకాలు:**

ఇక్కడ వెలసిన దక్షిణామూర్తి క్షేత్రపాలకుడుగా విరాలజిల్లుతున్నారు. ఈ ఆలయం వద్ద ప్రతి గురువారం విశేష పూజలు అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. ఇక్కడ గురుసంక్రమణ సందర్భంగా నిర్వహించే పూజలకు ఎంతో ఆదరణ ఉంది. తమిళనాడునుంచి భక్తులు విశేష సంఖ్యలో వస్తారు. ఉభయదారులుగా కూడా ఉన్నారు. ఇక్కడి ఆలయాన్ని భక్తుల భాగస్వామ్యంతో బంగారుతాపటం జరిపించారు. అంతేకాక గురువారం షోడషాభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద భక్తులు వరుస కట్టారు. ఉదయం ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో దీక్షా గురుకుల్ నిరంజన్ గురుకుల్ గురుదక్షిణామూర్తి ఆలయం ఎదుట కలశస్థాపన గావించారు. తరువాత స్వామికి హోమాలు నిర్వహించారు. అనంతరం అభిషేకాలు చేసి స్వర్ణాభారణాలతో శోభాయమానంగా అలంకరించారు. వేదపండితుల వేద మంత్రాల మధ్య స్వామి వారికి 108 దీపాల పర్వత హారతి, చక్రహారతి, కుంభ హారతి మహామంగళ హారతులిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఎఇఓ ధనపాల్, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం, సూపరింటెండెంట్ నాగభూషణం స్థానిక భక్తులు విశేష సంఖ్య హాజరైనారు. పూజలు, అభిషేకాలను ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ సారధ్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

## పలు అభివృద్ధి అంశాల పై వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త విజయవాడ ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వర్చువల్ విధానంలో రెవెన్యూ ఫేజ్ 3, రీసర్వే, ఇనామ్, అసైన్డ్ భూములు, ల్యాండ్ రిక్వైర్మెంట్, హౌసింగ్, ఆరోగ్య వైద్యం, కుటుంబం సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్య శ్రీ, పిఆర్అండ్ఆర్‌డి ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి డా. కెఎస్ జవహర్ ంరెడ్డి సమీక్షించారు. ఈ విడియో కాన్ఫరెన్స్ జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్ రెడ్డి, ఏడి సర్వేర్ జయరాజ్, జిల్లా హౌసింగ్ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఆరోగ్య శ్రీ మేనేజర్ శివకుమార్, జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ ఆఫీసర్ తేజస్విని తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## యాత్ర 2 సినిమాకు ఎమ్మెల్సీ భరత్‌చే ఉచిత టికెట్లు

కుప్పం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జీవితం ఆధారంగా రూపొందించిన యాత్ర 2 సినిమాకు సంబంధించి గురువారం సినిమా విడుదల సందర్భంగా ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ వైకాపా నేతలు, కార్యకర్తలకు ఉచిత టికెట్లను అందించారు. స్థానిక ఎస్ఆర్ఎం థియేటర్‌లో యాత్ర 2 సినిమా రిలీజ్ కావడంతో ఉదయం ఆట నుంచే టికెట్లను నేతలు, కార్యకర్తలకు, అభిమానులకు ఉచితంగా అందించారు. కాగా 2009-19మధ్య సిఎం వైఎస్ జగన్ జీవితంలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో సినిమా రావడంతో వైఎస్సార్సీ శ్రేణులు సినిమా చూసేందుకు ఉత్సాహం చూపారు.

## వైకాపా ప్రభుత్వానిది ఎన్నికల గారడీ బడ్జెట్

- తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం

కుప్పం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో వైకాపా ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన ఔట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ఎన్నికల గారడీ బడ్జెట్‌గా ఉందని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం విమర్శించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2లక్షల కోట్లకు పైగా బడ్జెట్ చూపించారని ఇందులో ద్రవ్యలోటు కూడా అధికంగా ఉండడం బడ్జెట్ లోటుపాట్లను సూచిస్తుందన్నారు. ఈ బడ్జెట్ ఎవరికీ ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రకటించిన బడ్జెట్‌కు ఖర్చు చేసే బడ్జెట్‌లో చాలా తారతమ్యాలు ఉన్నాయన్నారు. గతంలో సైతం ఇలాగే జరిగిందన్నారు. పలు కార్యక్రమాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినా క్షేత్రస్థాయిలో ఖర్చు చేయలేదన్నారు. రాష్ట్రం ఆర్థిక ంగా చితికిపోయి ఉన్నా గొప ్పల కోసం 2లక్షల కోట్ల బడ్జెట్ ప్రకటించి అంకెల గారడీ చేయడం వైకాపా ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. సమావేశంలో నేతలు రాజ్‌కుమార్, డా॥ వెంకటేష్, కె.కన్నన్, విశ్వనాథనాయుడు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డా॥ అంబేద్కర్ విగ్రహావిష్కరణ

రామకుప్పం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



మండలంలోని గాంధీనగర్‌లో రాజ్యాంగ నిర్మాత డా॥ బిఆర్ అంబేద్కర్ నూతన విగ్రహాన్ని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డా॥ మయలా సుదర్శనం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నన్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, ఆంథోనిలు ప్రారంభించారు. ఈసందర్భంగా దళిత నేతలు మాట్లాడుతూ డా॥ అంబేద్కర్ భావితరాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. పండగ వాతావరణంలో విగ్రహావిష్కరణ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో దళిత నేతలు కందస్వామి, రామకృష్ణప్ప, రఘు, నారాయణస్వామి, అంబేద్కర్ విజయ్‌కుమార్, మునస్వామి, బాలాజీ, జనసేన నరేష్ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి కోసమే గ్రామ వికాసపత్రం

- మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

శాంతిపురం, ఫి బ్రవరి 8 ప్రభాతవార్త



గ్రామాల అభివృద్ధి కోసమే తెదేపా అధినేత అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాలతో గ్రామ వికాస పత్రాలు రూపొందిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొలమడుగు, శివరాంపురం, అకబలదొడ్డి, గుంజార్లపల్లి పంచాయతీలో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఏయే అభివృద్ధి పనులు చేయాలో అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినాఅందరూ ఏకత్రాటిపై నిలబడి చంద్రబాబుకు లక్ష మెజార్టీ తేవడమే ధ్యేయంగా పనిచేయాలనికోరారు.విబేధాలుపక్కనపెట్టాలనికుప్పానికిచంద్రబాబుచేసినఅభివృద్ధిప్రజలకు వివరించాలన్నారు.నేతలు విశ్వనాథనాయుడు, జనార్దనరెడ్డి, ఉదయ్‌కుమార్, నాగరాజు, మణి, రమేష్, భాస్కర్, ఆనందరెడ్డి,సుబ్రమణ్యం, సూరప్ప, శ్యామల, ఉయ్యాలజయరాంరెడ్డి, నారాయణరెడ్డి, పుష్ప, నారాయణ స్వామి, శేఖర్, చంద్రకళ, అనసూయ, సుగుణమ్మ, శ్యామలమ్మ, రూప, పౌలారాణి పాల్గొన్నారు.

## కారుతో సహా కర్ణాటక మద్యం సీజ్.. ఒకరి అరెస్ట్

**వి.కోట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త** కర్ణాటక నుంచి కారులో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యంను సీజ్ చేసి ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. రామకుప్పం మండలంకు చెందిన వసంత్‌కుమార్‌రెడ్డి, అతని అనుచరులతో కలిసి కర్ణాటక మద్యం వ్యాపారం చేసేవాడు. గురువారం వి.కోట సిఐ లింగప్ప అధ్వర్యంలో బైరుపల్లి క్రాస్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారు వేగంగా వచ్చింది. దీన్ని వెంబడించిన పోలీసులు కర్ణాటక మద్యంను పట్టుకున్నారు. రామకుప్పం మండలంకు చెందిన డ్రైవర్ అరుణ్‌కుమార్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. వసంత్‌కుమార్‌రెడ్డి పరారయ్యాడు. వీరి నుంచి సుమారు లక్ష విలువ చేసే కర్ణాటక మద్యాన్ని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

## తహశీల్దార్‌చే పోలింగ్ కేంద్రాల పరిశీలన

రామకుప్పం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

మండలంలోని కెంచనబళ్ల పరిధిలో 85,86 పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ శ్రీధర్ పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మరిన్ని వసతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈదేశ ప్రజలు,సంస్కృతి బిజెపి మూలాలు

-కన్వీనర్ మదన్‌మోహన్

పుంగనూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :



భారతదేశ ప్రజలు,సంస్కృతి,ప్రేమాభిమానాలు,దేశభక్తి, సంస్కా రం భారతీయ జనతాపార్టీకు పంచప్రాణాలని నియోజకవర్గ కన్వీనర్ మదన్ మోహన్ అన్నారు. గురువారం ఆయన పుంగనూరు పట్టణంలో జరిగిన రాజంపేటజిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నర్సిం హులు అభినందన సభలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భాజాపాకు మతపరమైన సంబంధమును చెప్పేవారికి ఎటువంటి లోకజ్ఞానం లేదనిభావిం చాలన్నారు. పార్టీకు ఈ దేశం, ఈ దేశ ప్రజలు వారి బాగోగులే ఎంతో ముఖ్యమన్నారు. ఇటువంటి ఉన్నతదేశంలో మతం, కులం చూడబోమని, హైందవ ధర్మమే ప్రధానంగా ముందుకు సాగుతామన్నారు. రాజంపేట జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నర్సింహులు చేస్తున్న పార్టీ సేవలకు ఆయనను గుర్తించి జిల్లా పదవి అందించామన్నారు.ఏబివిపి రాష్ట్ర నాయకుడు జిఆర్ విజయ్‌శంకర్,పెద్దమఠంబాబు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనది.. అవగాహన అవసరం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :




ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనది ప్రజలు అవగాహనతో ముందుకు వెళ్ళడం ద్వారా మంచి పాలన సాధ్యమవుతుందని ఓటర్లు గుర్తించాలని ఎపియం కవిత పేర్కొన్నారు. మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయితీ పరిధిలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వా మ్యంలో ఓటరుకు ఉన్న పాసుపతాస్త్రమన్నారు. 18 సంవత్స రాలు నిండి ప్రతి భారతీయ పౌరుడికి వివక్షతలేకుండా ఓటు హక్కు కల్పించడం జరుగుతుందన్నారు. 18 సంవత్స రాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. దేవళంపేట కూడలిలో మహిళ సంఘాల సభ్యులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్రలు మునిలక్ష్మీ, సిసిలు, వివో లీడర్లు, మహిళ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థినిని సత్కరించిన తెదేపా నేతలు

కుప్పం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



ఎంబిబిఎస్ ఫస్టియర్ పరీక్షా ఫలితాల్లో పిఇఎస్ వైద్య కళాశాలలో చదువుతున్న ధార్మిక శ్రేష్ట అనే విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులను తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, తెదేపా నేతలు ఘనంగా సత్కరించారు. ఈ విద్యార్థిని మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, కెజెసి ప్రిన్సిపాల్ సుప్రియల కుమార్తె. ఈమె ఫస్టియర్ పరీక్షా ఫలితాల్లో 82.72శాతం మార్కులతో కళాశాల టాప్2గా నిలిచింది. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, రాష్ట్ర నేత శాంతారాం, నేతలు మణి, సంతోష్, నాగభూషణం, నబీ ఉల్లా, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## 150రోజులకు చేరిన ఎన్టీఆర్ ట్రస్ట్ ఉచిత వైద్యశిబిరాలు

కుప్పం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గంలో ఎన్టీఆర్ స్మారక ట్రస్ట్ అధ్వర్యంలో ఆరోగ్య రథం ద్వారా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు 150 రోజులు పూర్తి చేసుకున్నా ్నయి. ఇప్పటి దాకా 110 గ్రామాల్లో క్యాంపులు, 8వేల మందికి ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు, మాత్రలు అందిం చారు. గురువారం డికెపల్లి ఎస్సీ కాలనీలో క్యాంప్ నిర్వహించిన డా॥ మధు, ఫార్మసిస్ట్ ఝాన్సీరాణి, పార్థసారథిలను మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ అధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మాజీ సర్పంచ్ మణి, యూనిట్ ఇన్‌చార్జ్ నబీ ఉల్లా తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సులభంగా జనన, మరణ ధృవపత్రాలు జారీ

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణకుమార్

చిత్తూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:



జనన, మరణ, వివాహ రిజిస్ట్రేషన్ ధృవపత్రాల జారీ ప్రక్రియ సులభంగా, వేగవంతంగా జరుగాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణ కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం జనన, మరణ, వివాహాల రిజిస్ట్రేషన్లు, ధృవీకరణ పత్రాల జారీ అంశాలపై పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్ మాట్లాడుతూ జనన, మరణాలు, వివాహాల రిజిస్ట్రేషన్ చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ, ధృవపత్రాల జారీ పారదర్శకంగా జరగాలన్నారు. ఈ చట్టాలపై సామాన్య ప్రజలకు ప్రాథమిక అవగాహన కల్పించాల్సిన అవసరం వుందన్నారు. ముఖ్యంగా వివాహ రిజిస్ట్రేషన్లపై విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు తప్పనిసరిగా మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చేయించుకొనేలా చూడాలన్నారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణ మాట్లాడుతూ జనన, మరణ, వివాహ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నగర పాలక సంస్థ పరిధిలో పక్కాగా నిర్వహిస్తున్నామని, సీనియర్ సివిల్ జడ్జి సూచనల మేరకు మరింత విస్తృతంగా సేవలు అందించడానికి చర్యలు తీసుకొంటామన్నారు. జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ వివాహ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మరింత సులభతరం చేయడానికి ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులు చేసుకొన్న వారికి జనన ధృవీకరణ పత్రాలు అందజేశారు. కొత్తగా వివాహం చేసుకొన్న వారికి మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చేయించి ధృవపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, సహాయ కమీషనర్ గోవర్ధన్, పలమనేరు మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, సిఎంఎం గోపి, ఎఎస్‌ఓ సౌందర్‌రాజన్, పంచాయతీ, వార్డు కార్యదర్శులు, జిల్లా రిజిస్టార్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం పూజలు

చౌడేపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానా ర్చకుడు పృద్వీనవీన్ ఆధ్వర్యంలో స్వామివారి ఉదయాన్నే ప్రత్యేకాభిషేకం, అలంకరణగావించారు. సాయంత్రం కాగడా హారతి వంటి కార్యక్రమాలు జరిగాయి. ఉభయదారులచే స్వామివారి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## నేడు వైఎస్సార్ ఆసరాకు మంత్రి పెద్దిరెడ్డి రాక

పుంగనూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :



పుంగనూరు మండల,పట్టణ ప్రాంతాలలో మహిళలకు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం కింద నిధులు మంజూ రు కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం పట్టణానికి రానున్నారు. ఈమేరకు మంత్రి పాల్గొనే సభ నిర్వహణకు పట్టణంలోని వ్యవసాయమార్కెట్‌కమిటీ స్థలాన్ని ఎంపిక చేసి,అక్కడ సభావేదిక ఇతర ఏర్పాట్లను జడ్పిసిఇఒ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. వేలాది మంది పాల్గొనే ఈసభ నిర్వహణలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు సదుపాయాల కల్పన చేస్తున్నట్లు ఎంపిపి అక్కిసాని భాస్కరరెడ్డి తెలిపారు. వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయ ఆవరణలో అన్ని ఏర్పాట్లకు వారం ముందు నుంచే కార్యాచరణ ప్రారంభించామని యార్డు ఛైర్మన్ అమరనాథరెడ్డి తెలిపారు.కార్యక్రమంలో మంత్రి పిఏ చంద్రహాస్,ఏవోసిహెచ్ నారాయణ,వైకాపా నాయకులు అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బెంగళూరు లయన్స్‌క్లబ్‌చే అటవీ సిబ్బందికి టీషర్టుల వితరణ

కుప్పంరూరల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

బెంగళూరు లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రేరణ, కుప్పం లయన్స్ క్లబ్‌ల అధ్వర్యంలో రామకుప్పం ననియాల ఎలిఫెంట్ క్యాంప్‌లో ఉన్న అటవీ సిబ్బందికి ఉచితంగా టీ షర్టులు, సీడ్ బాల్‌లను అందించినట్లు లయన్స్‌క్లబ్ జోనల్ ఛైర్మన్ డా॥ మహేష్ తెలిపారు. ఈసందర్భంగా అక్కడి శిక్షణ ఏనుగులకు ఒకపూట ఆహారాన్ని అందజేశారు. లయన్స్‌క్లబ్ జోనల్ ఛైర్మన్ డా॥ మహేష్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అటవీ అధికారులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పేద మహిళలకు ఆర్థిక చేయూత

వాకాడు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త



వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామంలోని గురువారం శ్రీ పట్టాభిరామాలయం శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు రామిం రెడ్డి మధు కిరణ్ రెడ్డి వారి సోదరి లావణ్యల దాతృత్వంతో గుంటూరు జిల్లా కొల్లిపర మండలం అత్తోట గ్రామంలో అగ్ని హోత్రం సువర్ణ లక్ష్మికి ఫలసరుకులు, బియ్యం, కూరగాయలు, రొక్కం మొత్తం 30 వేల రూపాయలను సంస్థ ప్రతినిధి, తిరుపతి జిల్లా అర్చక సలహా మండలి సభ్యులు దీవి అనంతబాబు అందజేసారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా అర్చక సలహా మండలి సభ్యులు డాక్టర్ దీవి శ్రీనివాస్, డాక్టర్ మురళీకృష్ణ, నారాయణం కోదండ సత్య శ్రీనివాసాచార్యులు, వెంకట రంగ రాజ్యలక్ష్మి, పరిమళ, అర్చక సమాఖ్య సత్తెనపల్లి మండల కన్వీనర్ వేదాంతం శ్రీకాంత్, విఖాస మండలి సహాయ కార్యదర్శి వేదాంతం ధన్వంతరి, పరాశరం భరద్వాజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు వెంకటగిరి అసెంబ్లీ టికెట్ ఇవ్వాలి

బీసీ వెల్ఫేర్ జెఏసి జిల్లా అధ్యక్షులు బొమ్మి నాగకిషోర్ యాదవ్

వెంకటగిరి, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త



వెంకటగిరి అసెంబ్లీ టికెట్‌ను బీసీలకు ఇవ్వాలని బిసి వెల్ఫేర్ జెఏసి జిల్లా అధ్యక్షులు బొమ్మ నాగకిషోర్ యాదవ్ కోరారు. వెంకటగిరిలోని ఆర్‌అండ్‌బి అతిధి గృహంలో జిల్లాలోని బీసీ సంఘం నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో వెంకటగిరిలో ఎక్కువ మంది బీసీలు ఉన్నందున ఇక్కడ బీసీ కులస్తులకు టికెట్ ఇవ్వాలని కోరారు. వెంకటగిరి అసెంబ్లీ ఏర్పడినప్పుటి నుండి నేటి వరకు బీసీలకు ఇవ్వలేదని తెలిపారు. బీసీలకు టికెట్ ఇస్తే అందరం ఏకమై గెలిపించుకుంటామని చెప్పారు. సమావేశంలో పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు సోమగోపాల్, బెల్లంకొండ చిన్నయ్య, యావ జిల్లా నాయకులు తోట రామచంద్రయ్య మొదలియార్, రాపూరు మండల బిసి నాయకులు మధుసూదన్ రావు, నాసిన భాస్కర్ గౌడ్, పెద్దిబోయిన మునిరావు, పేరుబోయిన విజయ్ కుమార్, ఆవుల కృష్ణయాదవ్, మల్లికార్జున, గెరిటి చెంచయ్య యాదవ్, బిల్లు సిసింద్రీ యాదవ్, కుమార్ మొదలియార్, కార్తికేయ నారాయణ ఆచారి, అత్తి మునిరత్నం, సత్తల గిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 12న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

బాలాయపల్లి, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం వైఎస్ఆర్ కాంత్రి పథం కార్యాలయంలో ఈ నెల 12నఉదయం10.30గంటలకుఎంపిపి గూడూరు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడిఓ అరుణ తెలిపారు. సమావేశానికి సర్పంచులు, జడ్పిటిసిలు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

## ప్రైవేటు డిగ్రీ కళాశాలలో మై ఫస్ట్ ఓట్ ఫర్ సిబియన్ కార్యక్రమం

గూడూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త




గూడూరు నియోజకవర్గంలో రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు టిడిపి ఇంచార్జి పాశిం సునీల్ కుమార్ సూచనల మేరకు ఏపి వారియర్స్ పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాల నందు ఉన్న విద్యార్థులను కలిసి వారి మొదటి ఓటు తెలుగుదేశం పార్టీకే ఎందుకు వేయాలో వివరించారు. రాష్ట్ర తెలుగు మహిళ నాయకురాలు గుండాల లీలావతి, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి, మట్టం శ్రావణి, తెలుగుయువత పార్లమెంట్ నాయకులు ప్రణీత్ యాదవ్, కుంచెం దయాకర్, వేముల సునీల్, గుండాల సందీప్, కళ్యాణ్ కృష్ణ, జీవన్, అల్లం వెంకట సాయి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు అసనాపురం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కేజే ప్రకృతి కుమార్

వెంకటగిరి, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

వెంకటగిరి జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టుకు ఇంచార్జ్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కేజే ప్రకృతి కుమార్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో కొలకోట్లలో ప్రకృతి కుమార్ ఏపీపీగా పనిచేశారు.

## వైఎస్ఆర్‌సిపిలో చేరిన డాక్టర్ వి.పెంచలయ్య

గూడూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త



గూడూరు పట్టణ పరిధిలోని కందుకూరుకు చెందిన ఆదిశంకర కాలేజ్ కరస్పాండెంట్ డాక్టర్ వంకి. పెంచలయ్య వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇవాళ శాసన సభలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో పెంచలయ్యతో పాటు ఆయన ఇద్దరు కుమార్తెలు వి.అరవింద, డాక్టర్ వి.ఐశ్వర్య వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి పాల్గొన్నారు.

## అగచాట్లపురం అభివృద్ధికే మొదటి ప్రాధాన్యత

- ఇంటింటి ప్రచారంలో టీడీపీ మండల కన్వీనర్ కిషోర్ నాయుడు

చిట్టమూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి ప్రాధాన్యత అగచాట్లపురం అభివృద్ధికే అని మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు అన్నారు. యల్లసిరి పంచాయతీ పరిధిలోని అగచాట్ల పురంలో రోడ్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల కల్పనకు స్థానిక బిసి సంఘం నాయకులు కాపులూరు చెంచురామాచారి ఆధ్వర్యంలో గూడూరు అభివృద్ధి ప్రదాత పాశం సునీల్‌కుమార్ సహకారంతో అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటడంతో పాటు గ్రామాల్లో అభివృద్ధి లేదన్నారు. యల్లసిరి పంచాయతీ టిడిపికి కంచుకోట అని, రాబోయే ఎన్నికల్లో ప్రజలంతా నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో గూడూరు బరిలో దిగనున్న పాశం సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నారావు, రాజేష్‌రెడ్డి, పుల్లారెడ్డి, నాగూరయ్య, కల్లూరు మణి, వెంకటరమణ, శివారెడ్డి, మురళీధర్, అంకయ్య, అంకబాబు, కంటేపల్లి దేవుడు, ఉదయ్, బషీర్ తదితరులు ఉన్నారు.

## తహశీల్దార్‌గా కరుణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరణ

గూడూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



గూడూరు తహశీల్దార్‌గా కరుణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా గూడూరు మండలంలోని విఆర్‌ఓలు, మండలరెవెన్యూ కార్యాలయం సిబ్బంది తహశీల్దార్‌కు పుష్పగుచ్చం అందజేసి ఘనస్వాగతం పలికారు. కరుణకుమార్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా దాచేపల్లి మండల రెవెన్యూ అధికారిగా పనిచేస్తూ ఎన్నికల నిర్వహణ బదిలీలలో భాగంగా గూడూరు తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు.కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు శివకుమార్, రాధా కృష్ణయ్య, వెంకటేశ్వర్లు రాజు, హనుమంతయ్య, పుల్లయ్య, చెంచయ్య, రాజేష్, రమణయ్య, వెంకట రమణయ్య, కార్యాలయ సిబ్బంది, ఆయా గ్రామాల విఆర్‌ఏలు పాల్గొన్నారు.

## మదీన మసీదులో ముతవల్లిల సమావేశం

కోట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



గూడూరు నియోజకవర్గం ముత వల్లిల కమిటీ అధ్యక్షుడు షేక్ మొబిన్‌బాషా ఆధ్వర్యంలో కోటలోని శ్యామ సుందరపురంలోని మదీన మసీదులో ముతవల్లిల సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తిరుపతి జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్స్పెక్టర్ ఆలీభాయ్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలీభాయ్‌కు నియోజకవర్గంలోని ముతవల్లిలను మొబిన్‌బాషా పరిచయం చేశారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. మొబిన్‌బాషా మాట్లాడుతూ నియోజకవర్గ కమిటీ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు జరిగిన అభివృద్ధిని వివరించారు. నియోజకవర్గంలోని మసీదులు, ఈద్గాలు, శ్మశాన వాటికల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతులు, ఖర్చు చేసిన నిధులను నివేదిక రూపంలో మొబిన్‌బాషా వివరించారు. సమావేశంలో ముతవల్లి కమిటీ ఉపాధ్యక్షులు రహీమ్, సంయుక్త కార్యదర్శి అమీర్, కార్యదర్శి జిలాని, మస్తాన్‌బాషా, రియాజ్, ఇదాయతుల్లా, మౌలానా నజీర్, అమీరుద్దిన్, ఇంతియాజ్, ఇస్మాయిల్‌తో పాటు 82 మసీదుల ముతవల్లిలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## డీవార్మింగ్‌ను విజయవంతం చేద్దాం

కోట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

ఫిబ్రవరి 9న చేపట్టే జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని కోట మండలంలోని అన్ని విద్యా సంస్థల ఉపాధ్యాయులు, ఉద్యోగులు విజయవంతం చేయాలని చిట్టేడు ఆరోగ్య ఉపకేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగరాజు కోరారు.గురువారంఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో, విద్యాసంస్థల్లో, వైద్య శాలల్లో పిల్లలకు అవగాహనకల్పించాలని కోరారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం, సౌచాల్యానికి వెళ్లి వచ్చాక చేతులను శుభ్రం చేసుకోవడం ద్వారా, పరిశుభ్రతను పాటించడం ద్వారా నులిపురుగుల బారిన పడకుండా నివారించవచ్చనితెలిపారు.మండలవ్యాప్తంగాపిల్లల కడుపులో నులి పురుగులను నివారించడానికిఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కోట మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్ల తదితర వాటికి ఉచితంగా అందిస్తున్నా మని పేర్కొన్నారు.

## ఈ-క్రాప్‌తో రైతులకు ఎంతో మేలు

తడ, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



రైతులందరు ఈ-క్రాప్ చేసుకొని ప్రభుత్వ సాయం పొందాలని సూళ్లూరుపేట వ్యవసాయశాఖ ఏడీ అనిత పేర్కొన్నారు. ఆమె ఇటీవల పలు గ్రామాల్లో స్థానిక వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందితో కలిసి రైతులతో పంటకు సంబంధించిన ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారు. తడ మండలం ఇరకం వంటి దీవులలోను వ్యవసాయశాఖ అధికారులు పంట నమోదు, ఈకేవైసీ వంటివి చేశారు. ప్రభుత్వ పథకాలు అందరికీ అందాలంటే వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందికి సహకరించాలని ఆమె పేర్కొన్నారు. మండల పరిధిలో ఇప్పటికే అనేక గ్రామాల్లో పూర్తి చేశామని, ఇప్పుడిప్పుడే వరి కోతలు కూడా మొదలయ్యాయని ఏడీ తెలిపారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి కాంచన, పలువురు విస్తరణ అధికారులు పాల్గొంటున్నారు.

## తడ తహశీల్దార్‌గా సయ్యద్ ఇక్బాల్ బాధ్యతలు స్వీకరణ

తడ, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



తడకు నూతన తహశీల్దార్‌గా సయ్యద్ ఇక్బాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్బాల్‌ను మండల తహశీల్దార్ కార్యాలయసిబ్బంది,పలువురు విఆర్‌ఓలు స్వాగతించారు. ఇంతకుముందు ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన కటారి జయజయరావు బదిలీపై వెళ్లడంతో ఇక్బాల్‌ను ఉన్నతాధికారులు నియమించారు.

## రహదారి భద్రత మీ జీవితానికి రక్ష

మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ సునీల్

గూడూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త



రహదారి భద్రత మీ జీవితానికి రక్ష అని మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ సునీల్ పేర్కొన్నారు. రోడ్డు భద్రత వారోత్స వాలలో భాగంగా గూడూరు పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ పాఠశాలలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల్ని చైతన్యవంతం చేసేందుకు వారం రోజులుగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు.

## రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్‌చే గోరుముద్ద కార్యక్రమం

చిల్లకూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త



చిల్లకూరు మండలంలోని పాలిచర్లవారిపాలెం గ్రామ జడ్పి ఉన్నత పాఠశాలలో రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గోరుముద్ద కార్యక్ర మాన్ని ఏర్పాటు చేశారు. ఈ గోరుముద్ద ద్వారా మండలంలోని అన్ని పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు ప్రతి రోజు సాయంత్రం వేళల్లో అల్పాహారం అందజేస్తారు. గత కొన్నేళ్ళుగా ఈ కార్యక్రమాన్ని రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా మండలంలోని అన్ని పాఠశాలల్లో చదువుతున్న పది విద్యార్థులకు గోరుముద్ద కింద అల్పాహారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు పిచ్చయ్య నాయుడు, రామయ్య నాయుడు, ఉప విద్యాశాఖాధికారి శివప్రకాష్ రెడ్డి, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## చల్లపాళెంలో సత్సంగమం

**శ్రీకాళహస్తి రూరల్,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త** మండలంలోని చల్లపాళెం బిసి కాలనీలోని అచల పరిపూర్ణరాజయోగ ఆశ్రమంలో సత్సంగమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు ప్రజలకు వివరిస్తూ వేదాంతం మనిషిని ఎలా నడచుకోవాలో తెలియజేస్తుందన్నారు.మనిషి పుట్టక తత్వాన్ని తెలుసుకుంటే సమాజంలో శాంతి సౌఖ్యంతో ప్రజలు ఉంటారన్నారు. ఏ ఇంటిలో అయితే ప్రేమ,సత్సంగమం ఉంటుందో ఆ కుటుంబం సుఖ సంతోషాలతో తులతూగుతుంటుందన్నారు.ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనకల్గిన సభల్లో పాల్గొని గురువు బోధలను వినటం వినినదానిని ఆచరించాలని సూచించారు.నేడు సమాజంలో ఈర్ష్యా ద్వేషాలతో శాంతి భద్రతలకు విఘాతం కల్గుతుందని వివరించారు.కాబట్టి గురుబోధనలను ఆచరించాలని కోరారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రాణాలు కాపాడుకోండి



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త** రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలని శ్రీకాళహస్తి ఆర్టీసి డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ద స్కూల్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిధిగా విచ్చేసిన డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు పంపిణీచేశారు. రోడ్డు భద్రతపై వ్యాసరచన పోటీలు నిర్వహించిన గెలుపొందిన విద్యార్థులు కోమల, దయ, లలిత ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. వీరికి ప్రోత్సాహక బహుమతులను ఆర్టీసి తరపున డిఎం రాజవర్ధన్‌రెడ్డి అందించడంతోపాటు మరోముగ్గురికి పాఠశాల తరపున ప్రోత్సాహక బహుమతులను పాఠశాల కరస్పాండెంట్ జనార్ధన్‌రావు జె.పవార్ అందించారు. విద్యార్థులు నడిచేటపుడు రోడ్డు నియమాలను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో డిపో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వైడి.కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.విశాల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదల బతుకులు మార్చేది ఒక్క వైఎస్ఆర్‌సిపినే

తొట్టంబేడు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చే సుపరిపాలన అందించేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని మరోసారి గెలిపించేందుకు ప్రజలు సిద్దంగా ఉండాలని ఎంఎల్ఏ సతీమణి బియ్యపుశ్రీవాణి తెలిపారు. పేదల జీవితాలను మార్చేది ఒక్క వైకాపా ప్రభుత్వమే అని, నేడు ఎంతోమంది వృద్దులు, వితంతువులకు, ప్రత్యేక ప్రతిభావంతులకు ఫించను మంజూరు చేసిన ఘనత ఒక్క వైకాపా ప్రభుత్వానిదే అని ఈఫించన్లతో వారికి మందులు, వైద్యఖర్చులు చేసుకునేందుకు ఉంటుందన్నారు. గురువారం మండలంలోని పిల్లమేడు పంచాయతీలోని దయనేడు, హరిజన వాడ మామిడిగుంట, పిల్లమేడు హరిజనవాడ, ఎస్‌టి కాలనీ గ్రామాల్లో ప్రతి గడపలో జగనన్న పథకాల ద్వారా లబ్దిపొందిన లబ్దిదారులతో మమేకమవుతూ వృద్దుల సమస్యలు తెలుసుకుంటూ కరపత్రాలను పంపిణీచేస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ఎంపిపి ఉన్నంనిర్మల, సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవ నాయుడు, పిఏసిఎస్ ఛైర్మన్ పోతుగుంటమణిబాబునాయుడు, సర్పంచ్ సుబ్బమ్మ, మణి, ఎంపిటిసి గురుమూర్తి కొన్నలిరమేష్ పలువురు వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

మండలంలో విస్తృతంగా బిజెపి ప్రచారం

**తొట్టంబేడు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త** గడపగడపకు ప్రధాని నరేంద్రమోడీ సంక్షేమ పథకాలు, వాటికి సంబందించిన కరపత్రాలను మండల పార్టీ అధ్యక్షుడు వేదాం కృష్ణయ్య ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటిపురందేశ్వరి ఆదేశాలతో రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ సూచనలతో మండలంలోని గొట్టిపూడి, దళితవాడ గ్రామాల్లో ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు, బిజెపి నేత నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీచేశారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పార్టీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోడీ పథకాలు పేదలు, రైతులు, మహిళలు, యువత అభివృద్ది కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అవి అమలు జరుగుతు న్నాయా?లేదా అని వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభలు పెట్టి ప్రజలకు వివరించామన్నారు. నియోజకవర్గంలో ఒక్కసారి కోలా.ఆనంద్ కుమార్‌కు అవకాశం ఇచ్చి కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఓబిసిమోర్చా కార్యదర్శి పెద్దపాలెం రవి ఆచారి, పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రికి డయాల్సిస్ కేంద్రానికి వీల్ ఛైర్

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రికి పట్టణానికి చెందిన ఓ కుటుంబం వీల్ ఛైర్లను అందించారు.పసుపులేటి వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులు ఆయన జ్ఞాపకార్థం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు డయాల్సిస్ సెంటర్‌కు రూ.10వేల రూపాయలు విలువ చేసే వీల్ ఛైర్ వితరణగా అందజేసారు.ఈ కార్యక్రమాల్లో కాపు సంక్షేమ సేన పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నవీన్ కుమార్, అనిల్‌కుమార్,కంఠా సుబ్బు, గిరి,కళ్యాణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



## సార్వత్రిక ఎన్నికలకు సిదంకండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

సార్వత్రిక ఎన్నికలకు సిద్దం కావాలి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సోమువేదవతి రాయల్ అన్నారు. బిజెపి తిరుపతి జిల్లా మహిళా మోర్చా కార్యవర్గ సమావేశం మరియు శక్తివందన్ క్యార్రమంను గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి చాగణం శైలజ, జాతీయ కార్యవర్గ సభ్యులు నిషిదరాజు, ఎస్‌హెచ్‌జి రాష్ట్ర కో కన్వీనర్ పుష్పలతలు పాల్గొని రాబోవు ఎన్నికలకు పటిష్టమైన మండల కమిటీలు బూత్, కమిటీలు పూర్తి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా నరేంద్రమోడీ మహిళా సాధికారత లక్ష్యంగా పేద మహిళలకు ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు ప్రజ్ఞశ్రీ, అంకమ్మ, దేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంజుల, సోషల్‌మీడియా కన్వీనర్ తేజోవతి, ఉమాసింగ్, మునిశ్వరి, సుశీల, గీతమ్మ మూడు మండల అధ్యక్షులు తదితర మహిళలు పాల్గొన్నారు.

## చౌటూరులో బోగస్ ఓట్లు తొలగించాలి : టిడిపి



**పుత్తూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** మునిసిపాలిటీలోని చౌటూరు గ్రామంలో 41వ నెంబరు బూత్‌లో బోగస్ ఓట్లను తొలగించి దానికి కారణమైన బిఎల్‌ఓ తేజస్వినిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత గ్రామస్తుడు కె.నాగరాజు గురువారం కమిషనర్ కె.ఎల్.ఎన్.రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారునికి మద్దతుగా వెళ్లిన టిడిపి నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ బూత్ పరిధిలో శాశ్వతంగా గ్రామం విడిచి చెన్నైలో స్థిర నివాసం ఏర్పరుచుకున్న సుమారు 19 మంది ఓట్లను జాబితాలో వుంచారని తెలిపారు. ఆ ఓట్లను తొలగించాలని తాము బిఎల్‌ఓ తేజస్వినీ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోకుండా ఏకపక్షంగా అనర్హులు ఓట్ల జాబితాలో వుంచారని తెలిపారు. అందువల్ల బోగస్ ఓట్లను తొలగించడంతో పాటు బిఎల్‌ఓపై చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎం.జీవరత్నంనాయుడు, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఎస్.గణేష్, చిత్తూరు జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎల్.ధనపాల్, నాయకులు యుగంధర్, ఆనంద్, ఏలుమలైరెడ్డి, ఆశోక్, హరి, అయ్యప్పన్, లక్ష్మీపతి, చిదంబరం తదితరులు పాల్గొన్నారు.



## మార్కెట్‌లోకి కైనెటిక్ గ్రీన్ ఈ- లూనా

**తిరుపతి,ఫిబ్రవరి 8ప్రభాతవార్త:** ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో అగ్రగామిగా ఉన్న కైనెటిక్ గ్రీన్ ఈ లూనా ద్విచక్రవాహనం ఆధునాతన సాంకేతికత ఫీచర్లతో ఉన్న స్టైలిష్ ,మల్టీ యుటిలిటీ ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలను ప్రవేశపెట్టింది. సంస్థమంత్రి నితిన్‌గడ్కరీ ,భారీ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ హనీఫ్ ఖురేషీ విడుదల చేశారు. ఈ లూనా వేగవంతమైన ఎలక్ట్రిక్‌తో నడిచే ద్విచక్రవాహనం. ఇందన పొదుపు, శబ్దంలేని ఉద్గార రహిత రైడ్ లక్ష్యం. ఇ మొబిలిటీ భవిష్యత్తు కోసం ఈ లూనా ఉపయోగపడుతుంది. ఈ కార్యక్రమంలో సిఇఒ సులజ్జఫిరోదియామోత్వాని ఇ లూనా సామర్థ్యం, పనితీరును వివరించారు.

## రేణిగుంట తహసీల్దార్‌గా నాగేశ్వరరావు

**రేణిగుంట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** రేణిగుంట తహసీల్దార్‌గా నాగేశ్వరరావు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు రేణిగుంట తహసీల్దార్‌గా పని చేసిన ఉదయ సంతోష్ ఎన్నికల బదిలీల్లో భాగంగా కడప జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో ఎర్రగుంట్ల నుంచి నాగేశ్వరరావు బదిలీపై వచ్చారు. 2014లో జరిగిన ఎన్నికల సమయంలో ఆయన కొద్ది నెలలు రేణిగుంట తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయనను గాజులమండ్యం ఎంపీటీసీ, శ్రీ సాయిగణేష్ విద్యా సంస్థల డైరెక్టర్ జువ్వల ధనుంజయరెడ్డి, మరో డైరెక్టర్ చెంగారెడ్డి, రేణిగుంట మేజర్ పంచాయతీసర్పంచ్‌నాగేష్,తదితరులు విడి విడిగా కలసి స్వాగతం పలుకుతూ ఘనంగా సత్కరించారు.

## సత్యవేడు నూతన తహసిల్దార్‌గా రామాంజనేయులు

**సత్యవేడు, ఫిబ్రవరి 08, ప్రభాతవార్త:** రానున్న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సత్యవేడు నూతన తహసిల్దార్ రామాంజనేయులు తెలిపారు. నూతన తహసిల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రామాంజనేయులు గురువారం ప్రాత్రికేయులతో మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడానికి అన్ని చర్యలు చేపట్టనున్నారు.

## నగరి ఆర్టీవోగా వెంకటరెడ్డి



**నగరి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** నగరి ఆర్టీవోగా వెంకటరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఆర్టీవోగా ఉన్న సుజన తదుపరి బదిలీపై వెళ్లడంతో కర్నూలు నుంచి బదిలీపై వచ్చిన వెంకటరెడ్డి నగరి ఆర్టీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి నిబద్ధతతో ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. కార్యాలయానికి సంబంధిత వ్యవహారాల్లో ఎలాంటి అలసత్వం లేకుండా సత్వరం పూర్తి చేస్తామన్నారు.

## నాగలాపురం తహశీల్దారుగా నరసింహులు బాధ్యతలు స్వీకరణ

నారాయణవనం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :



నాగలాపురం తహశీల్దారుగా నరసింహులు గురువారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా కెవిపల్లి నుంచి ఎన్నికల బదిలీలో ఇక్కడు వచ్చారు. 2024లో ఎన్నికలు సజావుగా జరగడానికి అందరు సహకరించాలన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వహిస్తామన్నారు. అలాగే మండలంలో ప్రజల సమస్యలు వుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

## సత్యవేడు వైకాపా సమన్వయకర్త రాజేష్‌కి సత్కారం

నారాయణవనం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :

తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త నూకతోటి రాజేష్‌ని గురువారం తిరుపతిలో కైలాసకోన మాజీ ఛైర్మన్ బత్తల భాస్కర్‌యాదవ్, ఉపసర్పంచ్ మురళిలు ఆయన్ని కలిసి పుష్పగుచ్చం అందించి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో వైకాపా గెలుపుకు అందరు కలిసికట్టుగా పని చేసి విజయం అందించాలని కోరారు.

## ఎస్సీ ఎస్టీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి..!

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి డి.వెంకటపతి మాదిగ

చంద్రగిరి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:

ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి డి.వెంకటపతి మాదిగ కోరారు. గురువారం ఆయన జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ ఉపకులాలకు సమ న్యాయం, సామాజిక న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కులాల మధ్యన ఏర్పడిన అంతరాలను తొలగించాలని కోరారు. ఎస్సీ ఎస్టీ వర్గీకరణలో సుప్రీమ్ కోర్టు ధర్మాసనానికి కేంద్రం మద్దతు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బి.సుబ్బరామయ్య, కత్తి హరి మాదిగ, పోట్లూరి రామారావు, కె.రామమూర్తి మాదిగ, శంకర్ మాదిగ, ఆర్.రవి మాదిగ, పత్తిపాటి గురుమూర్తి మాదిగ, డి.వెంకటేష్. తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రష పురోభివృద్ధికి టిడిపిని గెలిపించండి..!

టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్

రామచంద్రాపురం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:



రాష్ట్ర పురోభివృద్ధికి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్ కోరారు. గురువారం ఎన్ఆర్ కమ్మపల్లి, తిమ్మరాజుపల్లి, వేణుగోపాలపురం గ్రామాలలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ, మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడపగడపకు వెళ్ళి టిడిపి మ్యానిఫెస్టోను వివరించారు. ప్రతి కుటుంబానికి జాబు కావాలంటే నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. త్వరలో జరిగే సాధారణ ఎన్నికలలో పులివర్తి నానిని ఎంఎల్ఏగా భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, నాయకులు నరశింహారెడ్డి, మునిరామిరెడ్డి, చిట్టిబాబు నాయుడు, రథీష్ నాయుడు, కుమార్, చంద్రశేఖర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఉచితకంటి,గుండె వైద్య శిబిరం

సదుం,ఫిబ్రవరి8ప్రబాతవార్త

సదుంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఈనెల 10వ తేదీ శనివారం ఉచితకంటి వైద్యశిబిరం జరుగుతుందని నిర్వహకులు మురళికృష్ణ తెలిపారు. మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ మరియు శంకరనేత్రాయల చెన్నై వారి ఆద్వర్యంలో జరిగే శిబిరంలో ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించి ఇంటి వద్దకుచేరుస్తామని చెప్పారు. ఈఅవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అదేవిధంగా సదుం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య పరీక్షా శిబిరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతుందని సుబ్రమణ్యస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తెలిపారు. ఈశిబిరం బెంగళూరు వైదేహీ ఆసుపత్రి ఆద్వర్యంలో సీనియర్ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ దుర్గాప్రసాద్‌రెడ్డిచే పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం తప్పనిసరి

రొంపిచెర్ల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



గర్భిణులు తప్పనిసరిగా ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవడం అలవరచుకోవాలని రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ దినేష్‌కుమార్‌నాయక్ అన్నారు. గురువారం స్థానిక పీహె చ్‌సీలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమం కింద గర్భవతులకు గుండె పరీక్ష, బీసీ, షుగర్,ఉదరపరీక్షలు, రక్త పరీక్షలు,యూరిన్ పరీక్షలు నిర్వహించారు. పలువిషయాలపై అవగాహన కల్పించారు. అందుబాటులో ఉన్న అన్ని రకాల ఆకుకూరలు, కూరగాయలు, కోడిగుడ్డు,పాలు ప్రతిరోజూ తీసుకోవాలన్నారు. కాన్పు లను ప్రభుత్వ వైద్యశాలల్లోనే చేయించుకోవాలన్నారు. జననీ శిశు సంరక్షణా కార్యక్రమం కింద తల్లికి, శిశువుకూ అవసరమైతే ఉచితంగా రక్తం,స్కానింగ్, లాబ్‌పరీక్షలు,మందులు,ఆహారం అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యాదికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజం,ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ ఆధునీకరణ భవనం ప్రారంభం

రేణిగుంట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం విప్పమానుపట్టెడ వేమాపురం సంజీవరెడ్డి కాలనీలో పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఆధునీకరణ సర్పంచ్ లక్ష్మిపతిరెడ్డి గురువారం రాయలచెరువు పార్దు కిరణ్ చారిటబుల్ ట్రస్టు అధినేత సుబ్రహ్మణ్యంరెడ్డి చేతులు మీదుగా ప్రారంభోత్సవం చేయించారు. ఈ సందర్భంగా వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్, సర్పంచ్ లక్ష్మిపతిరెడ్డి మాట్లాడుతూ ఆధునీకరింపబడిన భవనంలోరైతు భరోసా, పశు సంవర్థక, వైద్య, వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. పంచాయతీలోని ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చిన పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు రెండు చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవలందించడానికి సిద్ధంగా ఉంటామన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

వరదయ్యపాలెం, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

వరదయ్యపాలెం మండల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా పిట్టి చెంగయ్య, ప్రధాన కార్యదర్శిగా వెంపళ్ళ చిన్నయ్య, ఆర్థిక కార్యదర్శి మోహనరావు, గౌరవ అధ్యక్షుడుగా పరందామయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యాక్షులుగా రంగన్నాథ్, రవిబాబు, శివకుమార్, మీరయ్య, కార్యదర్శులుగా సూరిబాబు, స్వామిదాస్, పి. వెంకటేశ్వర్లు , సుబ్బరామయ్య, సురేఖ, వసంత, ఆర్థిక కమిటీ సభ్యులు సంతోష్, చిన్నగురవయ్య, మోహన్ బాబు, గోకులకృష్ణ మహిళా కన్వీనర్ కె. సుగుణ, సిపిఎస్ కన్వీనర్ పి. హరిబాబు, జిల్లా కౌన్సిలర్లుగా శ్యామసుందర్, ఆదిశేషయ్య, ముజీబ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడ మైంది. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యా య సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## నేడు విద్యార్థుల సెక్సెస్ మీట్

తిరుపతి విద్య, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

టిటిడి విద్యా సంస్థల్లో అత్యుత్తుమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులను అభినందించి అఛీవర్ అవార్డులు ప్రదానం చేసే ప్రక్రియకు సంబంధించి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతి మహతి ఆడిటోరియంలో విద్యార్థుల సక్సెస్ మీట్ నిర్వహించనున్నారు. టిటిడి విద్యా సంస్థల్లో అకడమిక్స్, ఎన్‌సిసి,ఎన్ఎస్ఎస్,స్పోర్ట్స్ అండ్ గేమ్స్, కల్చరల్, కో కరికులర్, కాంపిటీటివ్ ఎగ్జామ్స్ వంటి అంశాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 240 మంది విద్యార్థిని, విద్యార్థులకు ఈ సందర్భంగా 5 గ్రాముల వెండి డాలర్, ప్రశంసాపత్రంఅందించనున్నారు.విద్యాశాఖ అధికారి డా.ఎం.భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

## దుల్హన్ పథకం ద్వారా ముస్లిం వివాహాలకు రూ.లక్ష

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

తాము అధికారంలోకి వచ్చాక మైనారిటి ముస్లింల సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఇప్పటికే తమకు దిశ దెశ నిర్దేశం చేసారని శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వినూత కోట తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దుల్హన్ పథకంలో మైనారిటి ముస్లిం ఆడబిడ్డల వివాహాలకు రూ.లక్ష అందిస్తామని ప్రకటించారు. పవన్‌కళ్యాణ్ ఇప్పటికే అన్ని వర్గాలను ఆదుకునే రీతిలో ప్రణాళికలు రూపొందించుకున్నారని ఉమ్మడి మెనిఫెస్టోలో ఈ అంశాలను ఐకూడా పొందుపరచనున్నట్లు వివరించారు.సుమారు రెండు నెలలుగా తాము ఇంటింటికి పల్లె పల్లెకు వెళ్ళి ప్రచారం నిర్వహిస్తున్నట్లు వివరించారు. తాము వెళ్ళిన ప్రతి చోటా అధికార పార్టీ పరిపానలతో విసిగి వేసారిన జనం తమకు ఘన స్వాగతం పలుకుతున్నారని వినూత వివరించారు.శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకుడు అవినీతి అక్రమాలే తమకు రాబోవు ఎన్నికల్లో ప్రచారంగాఉంటుందన్నారు.రాబోవుఎన్నికల్లోప్రజలు ఉమ్మడి అభ్యర్థులకు పట్టం కడతారని వివరించారు.

## అభివృద్ధి కావాలా? అవినీతి అక్రమ కేసులు కావాలా?

**శ్రీకాళహస్తి రూరల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త** పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి కావాలో అవినితి అక్రమాలు,అక్రమ కేసులు బనాయించే నాయకుడు కావాలో తెల్చుకోవాల్సి న సమయం అసన్నమౌతుందని తెలుగుదేశం పార్టీకి చెందిన బొజ్జల రిషితారెడ్డి ప్రచారం నిర్వహించారు. గురువారం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నేడు రాష్ట్రంలో పరిపాలన అధ్వాన్నంగా మారిందన్నారు. మనల్ని రిజర్వ్‌బ్యాంకు తాకట్టు పెట్టి అకౌంట్లలో సొమ్ములు వేస్తున్నారని ఆ అప్పులతో రాబోవు రోజుల్లో వారిని కొనసాగిస్తే మరో శ్రీలంక అవుతుందని ప్రజలు గమనించాలని రిషితా రెడ్డి పిలుపు నిచ్చారు.కాబట్టి రాబోవు ఎన్నికల్లో నియోజకవర్గ అభివృద్ధియే అజెండాగా పరిపాలించే బొజ్జల కుటుంబానికి అండగా నిలిచి సుధీర్‌రెడ్డిని గెలిపించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఆమెతో పాటు మండల అధ్యక్షుడు కామేష్‌యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి రింగినేని చెంచయ్యనాయుడు యూనిట్ ఇన్‌చార్జి కృష్ణారెడ్డి,మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## స్విమ్స్‌లో కాంట్రాక్ట్ పోస్టుల కొరకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి టౌన్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ క్లినికల్ వైరాలజీ విభాగంలో తాత్కాలిక కాంట్రాక్ట్ పద్ధతిన 3 పోస్టుల కొరకు దరఖాస్తులు చేసుకోవాలని స్విమ్స్ రిజిస్ట్రార్ తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు పూర్తి చేసి అవసరమైన అన్ని సర్టిఫికేట్లు జిరాక్స్‌లు ఈ నెల 12వ తేది సోమవారం ఉదయం 8 గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూకి తీసుకురావాలని తెలియజేసారు. సంబంధిత కాంట్రాక్ట్ పోస్టుల నియమాకం 12 నెలల వరకు వుంటుందని దీనిని అవసరాన్ని బట్టి మరి పొడగించబడుతుందన్నారు.

## అసెంబ్లీ సాక్షిగా ప్రజలకు క్షమాపణ చెప్పాలి

టిడిపి నాయకులు డిమాండ్

తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త



రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వ్యక్తిగత రాబడిని పెంచుకునేందుకు చూపించిన శ్రద్ధ, రాష్ట్ర అభివృద్ధి పై చూపలేదని, ఇటీవల అసెంబ్లీలో జరిగిన బడ్జెట్ విడదల తేటతెల్లమవుతుందని తిరుపతి తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు జి. నరసింహ యాదవ్ తెలిపారు. గురువారం ఉదయం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్ విడుదల అంతా ప్రజలను మోసం చేసే విధంగా ఉందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో మద్యనిషేధం చేస్తానని మహిళలకు మోసపూరిత మాటలు చెప్పిన జగన్మోహన్ రెడ్డి, మద్యం రేట్లు విపరీతంగా పెంచేశారని విమర్శించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదవాడి ఆకలి తీర్చేందుకు తెలుగుదేశం పార్టీ హాయంలో అన్న క్యాంటీన్ ప్రవేశపెట్టామని, దానిని కూడా తుంగలో తొక్కించారని ఆయన విమర్శించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం కూడా నిలిపేశారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని ఆయన ప్రజలను కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఆర్‌సి మునికృష్ణ, శ్రీధర్ వర్మ, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు మాట నిలుపుకున్న మన జగనన్న

వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

చంద్రగిరి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:



రాష్ట్ర వ్యాప్తంగా గల మహిళా సంఘాలకు రుణమాఫీ చేసి మాట నిలుపుకున్న మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి కోరారు. మండల పరిధిలోని రామిరెడ్డిపల్లి పంచాయతీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల నాటికి డ్వాక్రా గ్రూపు సభ్యులకు ఎంత అప్పు వున్నా ఆ మొత్తాన్ని నాలుగు విడతల్లో చెల్లిస్తానని చెప్పిన జగనన్న ఆ మేరకు చెల్లించి మాటతప్పని ముఖ్యమంత్రిగా నిలిచారని కొనియాడారు. మండలంలో గల 1161 స్వయం సహాయక సంఘాలలోని 1932 మంది సభ్యులకు 11.19 లక్షలు ఖాతాలకు జమచేయడం జరిగిందన్నారు. మాట నిలుపుకున్న జగనన్నను మళ్ళీ ముఖ్యమంత్రి చేయాలంటే మా అన్నయ్య తుడా ఛైర్మన్, ఎంఎల్ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. అంతకుముందు పంచాయతీ సర్పంచ్, మార్కెట్‌యార్డు ఛైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొటాల పద్మజ ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం లభించింది.

## రాస్‌చే రైతులకు రుణమేళా

ఏర్పేడు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:



రాస్ మహిళా భారతి పాపానాయుడుపేట శాఖలోని రాస్ సేవా నిలయం నందు గురవారం రైతు రుణమేళాతో పాటు వ్యవసాయ మెలకువల గురించి తెలియజేశారు. ఈకార్యక్రమంలో 123మంది రైతులకు 68.4 లక్షల రుణం మంజూరు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ శ్రీనివాసులు, ప్రోగ్రాం మేనేజర్, సీనియర్ సైంటిస్ట్ కృషి విజ్ఞాన కేంద్రం కరకంబాడి వారు మాట్లాడుతూ సాంకేతిక వ్యవసాయ విధానంలో మెలుకువలు తెలియజేశారు. సాంప్రదాయ పంటలైన వరి, వేరుశనగ వాణిజ్య పంటలు పూలతోట పెంపకం, కూరగాయ తోటల పెంపకంను సాంకేతిక పద్దతి జోడించడం వలన లాబాలను ఆర్జించ వచ్చని వివరించారు. తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకంపై పాపానా యు డుపేట రాస్ కార్యాలయంలో రైతులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆసక్తి ఉన్న రైతులు పాల్గొని మెలుకువలు నేర్చుకోవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి బాలాజి మాట్లాడుతూ రైతులకు లాభసాటిగాను, సమతుల్యంగాను ఉండటానికి పంటతో పాటు పాడి పరిశ్రమ ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో రాస్ మహిళా భారతి ఫీల్డ్ అధికారి వెంకట్ కుమార్, మునిపార్థసారధి, మునీంద్ర, తిరుపాల్, తదితర రైతులు పాల్గొన్నారు.

## షర్మిల సభను విజయవంతం చేయండి

జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పోటుగారి బాస్కర్

కార్వేటినగరం,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:



రాష్ట్రకాంగ్రెస్ పిసీసీ అధ్యక్షురాలు షర్మిల ఈనెల 11వ తేది నగరి నియోజకవర్గంలో రక్షబండ కార్యక్రమానికి రానున్నారని జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటలకు ఆమె రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారని,అక్కడ నుండి రోడ్డు మార్గంలో పుత్తూరుకు చేరుకుంటారని తెలిపారు. పుత్తూరులోని ఏపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షుడు రాకేష్‌రెడ్డి నివాసంలో భోజన కార్యక్రమం ముగించుకొని అక్కడ నుండి బయలుదేరి నగరి ఓంశక్తి గుడి వద్ద నుండి రోడ్‌షోలో పాల్గొని నగరి గడియారం సెంటర్ వద్ద జరుగు భారీ బహిరంగసభలో పాల్గొని ప్రసంగిస్తారని భాస్కర్ తెలిపారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అనుబంధసంస్థలు ఎస్‌సి,ఎస్‌టి,ఓబిసి. మైనారిటీ, మహిళాకాంగ్రెస్,యూత్ కాంగ్రెస్, సేవాదళ్,లీగల్‌సెల్,కిసాన్‌సెల్,పార్టీ అభిమానులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి మారుసాని గోవర్ధన్‌రెడ్డి,ఎపిసిసి డేలిగేట్ ఎపి పరదేశి,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు డి.కన్నన్,కాంగ్రెస్ సేవాదళ్ మాజీ జిల్లా అధ్యక్షుడు గౌతంరాజు,తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు కాంగ్రెస్ అండ

కార్వేటినగరం,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:

నిరుద్యోగులకు కాంగ్రెస్‌పార్టీ అండ ఎప్పుడూ మెండుగా ఉంటుందని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మారుసాని గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన డిఎస్‌సిపై స్పందించారు.ప్రభుత్వానికి ఐదేళ్ళుగా నిరుద్యోగులు గుర్తుకు రాలేదాని ప్రశ్నించారు. టేట్,డిఎస్‌సి నోటిఫికేషన్‌తో రాజకీయ లబ్ది పొందడం తప్ప నిరుద్యోగులకు ఒరిగేది ఏమీలేదని అన్నారు.నిరుద్యోగ జెఏసి ఉద్యమానికి కాంగ్రెస్‌పార్టీ అండగా ఉంటుందని అన్నారు. యువత,ఉద్యోగులతో చెలగాట మాడడం సహించరాని నేరంగా భావిస్తూ నిరుద్యోగ జేఏసి ఉద్యమానికి మా పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు.

## మామాడిలో పూత ఆలస్యంపై అవగాహన

నారాయణవనం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :

మామిడిలో పూత ఆలస్యంపై పుత్తూరు ఉద్యానశాఖ అధికారులు గురువారం రైతులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. మండలంలోని అరణ్యకండ్రిగ, కృష్ణమరాజులకంవడ్రిగ, నైనారుకండ్రిగ గ్రామం లోని రైతులతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి వెంకట సౌజన్య పాల్గొన్నారు. ఆమె మామిడి తోటలను పరిశీలించారు. ప్రస్తుతం మామిడిలో తేనె మంచు ఉత్పత్తి జరుగుతున్నట్టు గుర్తించారు. ప్రధానంగా ఖాదర్, బేనిషా, ఏమాని, జవేరి, బెంగులూరు వంటి మామిడి రకాల్లో పూత ఆలస్యంఅయినట్టు చెప్పారు. రైతులు తగు జాగ్రత్తలు తీసుకొని పిందె దశలో పంట కాపాడుకోవాలన్నారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

నారాయణవనం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :



బాల్య వివాహాలు నిర్వహించడం చట్టరీత్య నేరమని ఐసిడిఎస్ సూపర్వైజర్ బేబి తెలిపారు. మండలకేంద్రం లోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం బాల్య వివాహాలపై విద్యార్థునులకు అవగాహన కార క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనంలోనే పిల్లలకు వివాహాలు చేయడం వల్ల భవిష్యత్తులో వారి జీతాలు నాశనం అవుతుందన్నారు. మానసికంగా, శరీరకంగా ఎదురయ్యే సమస్యలను ఎదురొ్కవాలంటే చిన్నతనంలో వివాహాలు చేయడాన్ని అడ్డుకోవాలన్నారు. అనంతరం నారాయణవనం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ సులోచన, టీచర్లు, విద్యార్థునులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన రెవెన్యూ అధికారులు

నారాయణవనం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :

గత రెండు రోజులుగా రెవెన్యూ అధికారులు మండలంలోని అన్ని గ్రామాలను తిరుగూ పోలింగ్‌కేంద్రాలను తనిఖీ చేస్తున్నారు. బుధవారం పాలమంగళం, తుంబూరు, నైనారుకండ్రిగ, అరణ్యకండ్రిగ, గురువారం బొబ్బరాజుపాలెం, సముదాయం, కశింమిట్ట, భీమునిచెరువు, ఇప్పతాంగేల్, డికెపాలెం, బ్రాహ్మణతాతాంగేల్ పోలింగ్‌కేంద్రాలను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో అమలవుతున్న మౌళిక వసతులపై ఆరా తీశారు. 2024లో జరిగే ఎన్నికల నాటికి పోలింగ్‌కేంద్రాల్లో అన్ని రకాల మౌళిక సదుపాయాలను కల్పించాలని తహశీల్దారు శంకర్‌రావు కోరారు. ఆయనతో పాటు డిప్యూటీ తహశీల్దారు, ఎఎస్ఓ శ్రీధర్, సర్వేయర్ పాల్గొన్నారు.

# బిసీలందరు వైసిపికి బైబై చెప్పండి

## -జయహో బిసి సభలో సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి బారి నుంచి బిసి వర్గాలను రక్షించుకోవడానికి బిసిలంతా కలసికట్టుగా ముందుకు వచ్చి వైసిపికి బైబై చెప్పాలని తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు గురువారం పార్టీ బిసి విభాగం, పట్టణ అధ్యక్షులు పోలూరు శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో పట్టంలోని పార్టీ కార్యాలయంలో 'జయహో బిసి' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీరామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జి.దశరధాచారి తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుధీర్‌రెడ్డికి బహుకరించిన మహాత్మాజ్యోతిరావు దంపతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా బొజ్జలసుధీర్‌రెడ్డి మట్లాడుతూ గత తెలుగుదేశంపార్టీ ప్రభుత్వంలో ప్రతి ఒక్క పండుగకు బహుమానాలు అందించి బిసిలు కుటుంబ సమేతంగా సంతోషకరమైన వాతావరణంలో పండుగలుచేసుకునే వారిని కానీ నాలుగున్నర సంవత్సరాలుగా బిసి కుటుంబాలకు తమ పండుగలు చేసుకోవడానికి అప్పులు చేయాల్సి వస్తోందని బొజ్జల సుధీర్‌రెడ్డి ఆరోపించారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్క మండలంలో కమ్యూనిటీ భవనాలు నిర్మించేలా కృషి చేస్తానని తెలిపారు. సంక్షేమం, సుపరిపాలన కావాలంటే తెలుగుదేశంపార్టీ అధికారం లోకి రావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు, డాక్టర్ దశరధాచారి, రెడ్డివారిగురవారెడ్డి, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, బిసి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనస్వామియాదవ్, కార్య నిర్వాహక కార్యదర్శులు రేణుకాదేవి, డాక్టర్ యం. ఉమేష్ రావు, గిరిజన విభాగం తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు సుబ్బయ్య, వన్నెకుల క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల్‌రవి, గాండ్ల సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమణ్యం(బుజ్జి), తెలుగుయువత మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ కెవి.ప్రతాప్, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు కృష్ణయాదవ్, స్కిట్ కళాశాల మాజీ ఛైర్మన్ గురుదశరధన్, తిరుపతి పార్లమెంటు కార్యదర్శులు యంయస్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, ఢిల్లీబాబు, నియోజక వర్గ అధ్యక్షుడు దొరైరాజ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మునిరాజయాదవ్, మాజీ కౌన్సిలర్లు బీమాల మునికృష్ణ, శెంజిగరంసుప్రజ, శాంతి, గిరిధర్, పట్టణ అధ్యక్షుడు విజయ కుమార్, ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, జిలనీ, అద్దంకికిట్టు, హేమంత్, గోవిందు, కుమార్, గణేష్, బీమాల వెంకటేశ్వర్లు, బీమాల భాస్కర్, ముదిరాజ్, బాలసుబ్రమణ్యం(మణి), సుధాకర్, రామచంద్రయ్య, సునీల్, సుమతి, సుజాత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి అధికారంలోకి రావడం పక్కా...

### చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ మరో 60రోజులలో పక్కాగా అధికారంలోకి రావడం ఖాయమని, చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని స్పష్టం చేసారు. ' మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని', 'బాబు షూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ' 'కార్యక్రమాన్ని గురువారం లింగేశ్వర్‌నగర్‌లో నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్ళి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ లింగేశ్వర్‌నగర్ గ్రామ పంచాయతీలో చెత్త పెరుకుపోయి ఉందని, మురుగునీటి కాల్వాలు శుభ్ర పరచక దోమలు స్వేర విహారం చేస్తున్నాయని, రోడ్లు అధ్వన్నంగా ఉన్నాయని ఆరోపించారు. లింగేశ్వర్‌నగర్ గ్రామ పంచాయతీలో ప్రజా సమస్యలు తిష్టవేసి ఉన్నాయని, స్థానిక సర్పంచ్, ఎమ్మెల్యే ప్రజా సమస్యలను గాలికి వదిలేసారని ఆరోపించారు. ఒక అవకాశం ఇస్తే ప్రతి ఇంటికి పెద్ద కొడుకుగా బాధ్యతలు తీసుకుని, అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నానిని గెలిపించాలని తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఏ.ఈశ్వరరెడ్డి కోరారు. తిరుపతిరూరల్ మండలంలో తెలుగుదేశం పార్టీకి మంచి ఆదరణ లభిస్తుందని, పులివర్తి నాని ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని తెలిపారు.. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

## వైసిపి ప్రభుత్వ బడ్జెట్‌లో అంకెలు, అబద్ధాలే : గాలి భానుప్రకాశ్



పుత్తూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్‌లో అంతా అంకెలు, అబద్దాలు తప్ప ఏమీ లేదని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. రూ. 13 వేల కోట్ల రెవెన్యూ లోటును రూ. 44 వేల కోట్లకు అలాగే రూ. 35 వేల కోట్ల ద్రవ్య లోటునఉ రూ. 60 వేల కోట్లకు పెంచిన ఘనత ఆర్థిక మంత్రి రాజేంద్రనాథ్ రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు లేవని, ప్రస్తుత ప్రభుత్వ అప్పులు రూ. 11.58 లక్షల కోట్లని మాత్రం అర్థమవుతోందని తెలిపారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పులు రెట్టింపు అయ్యాయని, ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా ముఖ్యమంత్రి జగన్ రెడ్డి మార్చారన్నారు. నాసిరకం మద్యంతో వేల మందిని పొట్టనబెట్టుకుని దాని మీద వచ్చే డబ్బుతో జగన్ సర్కార్ నడుస్తోందని ఆరోపించారు. బడ్జెట్‌లో ఆరోగ్యశ్రీకి అంతంత నిధులు కేటాయించడం, తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ రద్దు చేయడం బట్టి పేదల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ది తెలుస్తోందన్నారు. 35 లక్షల పొదుపు సంఘాలకు బడ్జెట్‌లో మొండి చెయ్యి చూపారని, రైతు భరోసా ద్వారా లబ్దిదారుల సంఖ్య భారీగా తగ్గించేశారని పేర్కొన్నారు. మొత్తానికి ప్రభుత్వం చెప్పేదొకటి, చేసేది మరొకటి అనే విషయం ఈ బడ్జెట్‌తో స్పష్టమైందని తెలిపారు.

## నా తండ్రి బాటలోనే నడుస్తా..!

### తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



రామచంద్రాపురం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: నా తండ్రి ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి బాటలోనే నడచి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపి స్తానని తుడా ఛైర్మన్, ఎంఎల్ఏ అభ్యర్ధి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. గురువారం మిట్టకండ్రిగ, కుప్పం బాదూరు, సి.కె.పల్లి. నెత్తకుప్పం, అనుప్పల్లి సచివాలయాల పరిధిలో పలు నూతన భవనాలను, ఆర్వో ప్లాంట్లను ఆయన ప్రారంభించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, జగనన్నే మరోసారి ఎందుకు ముఖ్యమంత్రి కావాలి బుక్‌లెట్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ మహిళల పేరిట మంజూరు చేశారన్నారు. కరోనా కష్టంలో రెండు కోవిడ్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు అండగా నిలిచారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి శాసన సభకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఏ.వి.బ్రహ్మానంద రెడ్డి, జడ్పీటిసి ఢిల్లీ భానుకుమార్ రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, చిట్టిబాబు, తాతిరెడ్డి వెంకటరెడ్డి, వైస్‌ఎంపిపి లావణ్య చంద్రబాబు, సర్పంచ్‌లు మాదాసు మురగయ్య, హిమాల్ రెడ్డి, శాంబ యాదవ్, ఎంపిటిసిలు కృష్ణవేణి, మంజుల సిద్ధారెడ్డి, పంచాయతీ కన్వీనర్లు బేటే సాయి శశికాంత్, సిరిపిరెడ్డి కేశవులు రెడ్డి, నాయకులు యశ్వంత్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, తానాల శంకర్ రెడ్డి, ఆకా మోహన్ రావు, మోహన్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

## స్పీడ్ స్కేటింగ్‌లో వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



తిరుపతి (క్రీడా), ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : కోయంబత్తూర్‌లో 27వ తేది నుండి 30వ తేది వరకు జరిగిన స్పీడ్ స్కేటింగ్ పోటీలలో వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థి విశ్వహేతు రెడ్డి ఒక రజిత, ఒక కంస్య పథకం సాధించాడు. స్కేటింగ్ కోచ్ మహేష్‌ను, విద్యార్థిని వెరిటాస్ సైనిక్ స్కూల్ ఛైర్మన్ శేషారెడ్డి, డైరెక్టర్ శ్రీకర్‌రెడ్డి, దీన్ ఖాన్, రూప రాణి స్కేటింగ్ క్రీడాకారులని అభినందించారు.

## నేడు జగనన్నకు చెబుదాం కార్యక్రమం -జిల్లా కలెక్టర్ రాక

తొట్టంబేడు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : నేడు శ్రీకాళహస్తి-చెన్నై బైపాస్‌రోడ్డులో ఉన్న ఎస్ఎస్ కళ్యాణ మండపంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల ఇన్‌ఛార్జి ఎంపిడిఓ తరుణాక్షరెడ్డి, మండల వైకాపా సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడులు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అందరు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు మరియు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది మరియు ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రచారంలో దూసుకెళ్తున్న కమలదళం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : బిజెపి యువ నాయుడు కోలా.ఆనంద్‌కుమార్‌కు సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వాలని పట్టణ పార్టీ అధ్య క్షుడు గరికపాటి రమేష్‌బాబు తెలిపారు. గురువారం రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటిపురందేశ్వరి ఆదేశాలతో రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ సూచనలతో శ్రీకాళహస్తి పట్టణంలోని కెయంపల్లి, జైహింద్ పురంలో గడపగడపకు వెళ్ళి ప్రతి ఓటరును కలిశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఏపిలో విజయం మాదే అంటే కమలనాధులు ఓటర్ల చుట్టూ తిరుగుతూ కమలం గుర్తుకు ఓటు వేసి అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు బిజెపి కోసం శ్రీకాళహస్తి శాసన సభ్యుడుగా కోలా.ఆనంద్‌ను గెలిపించాలని కోరారు. నియోజకవర్గ పరిధిలో ప్రజలు మార్పుకోరుతు న్నారని బిజెపి నేతలు రమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి, అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమన్యంరెడ్డి, రాష్ట్ర ఓబిసి మోర్చా సభ్యులు ఎస్వీరమణ, పట్టన ఉపాధ్యక్షులు ఎల్.బత్తినగోపాల్, వాసుయాదవ్, కోనేటిఅయ్యప్ప, పలువురునేతలు పాల్గొన్నారు.

## తిరుపతి రైతు బజార్లో అక్రమాలు తొలగింపు



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : రైతులకు వినియోగదారులకు సౌలభ్యం కోసం గత ప్రభుత్వం అన్నమయ్య సర్కిల్ వద్ద రైతు బజార్ ఏర్పాటు చేసింది. వినియోగదారులకు తక్కువ రేటుకు కూరగాయలు ఇతర వస్తువులు అందు బాటులో ఉన్నాయి. అత్యంత రద్దీగా ఉండే రైతు బజార్‌లో దుకాణ యజమానులు వారి కేటాయించిన షాపుతో పాటు వినియోగదారులు కోసం కేటాయించిన పుట్ పాత్ ఆక్రమించి వ్యాపారాలకు కొనసా గిస్తున్నారు. వినియోగదారులను ఇబ్బందులను ఫిర్యాదు చేసిన దుకాణదారులకు ఎటువంటి చలనం లేదు. రోజురోజుకు వినియోగదారులకు రైతు బజార్‌లో ఇబ్బందులు అధికమయ్యాయి. కొత్తగా వచ్చిన రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ అయ్యప్ప స్పందించి దుకాణాలను వారికి కేటాయించిన స్థలం వరకు నిబంధన విధించాడు. దుకాణంకు ముందుకున్న ఆక్రమాలను తొలగించాడు. రైతు బజార్‌లో ఉన్న కొందరు దుకాణదారులు అయ్యప్పకు సహకరించకపోయినా బుజ్జగించి వినియో గదారులు శ్రేయస్సు కొరకు సహకరించాలని కోరారు. ఎంతో చిన్నదిగా సన్నగా ఉన్న వినియోగదారులకు పుట్‌పాత్ అక్రమాలను తొలగించడంతో ఒక్కసారిగా విశాలంగా అందంగా కనిపించాయి. పలువురు వినియోగ దారులు ఎస్టేట్ ఆఫీసర్ అయ్యప్పను రైతు బజార్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహాకుంభాభిషేకానికి మాజీ మంత్రికి ఆహ్వానం



నగరి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: దేశమ్మ దేవాలయ మహా కుంభాభిషేకానికి మాజీ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డికి మంత్రి రోజా ఆహ్వానం పలికారు. ఈ నెల 11వ తేదీ జరిగే నేత్ర ప్రధాయణి నూతన ఆలయ కుంభాభిషేక వేడుకల్లో కలుసుకోవాలని కోరారు. ఆమె వెంట ఆలయ కమిటీ ఛైర్మన్ వేణుబాబు, మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘం, కౌన్సిలర్ దయానిధి తదితరులు పాల్గొన్నారు.

## యాత్ర 2 సినిమా థియేటర్ వద్ద వైసిపి నేతలు సంబరాలు



వెంకటగిరి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవిత చరిత్రలో భాగంగా యాత్ర 2 సినిమా రిలీజ్ సందర్భంగా వైసిపి నాయకులు థియేటర్ వద్ద బాణ సంచాపేల్చి సంబరాలు నిర్వహి ంచారు. సినిమా రిలీజ్ సందర్భంగా మొదటిరోజు వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అందరూ చూసేందుకు ఉచిత ఏర్పాటు చేయించినట్లు మున్సిపల్ వైస్ ఛైర్మన్ బాలయ్య తెలిపారు. దివంగత రాజశేఖర్ రెడ్డి చరిత్ర సినిమాలో ఉందని తెలిపారు. సినిమా థియేటర్ ముందు బాణ సంచా పేల్చి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు, నాయకకులు గణేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పశుబీమాను పూర్తిచేయండి

నాయుడుపేట రూరల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త గ్రామాల్లో రైతుల వద్ద ఉన్న పశువుకు పశుభీమాను త్వరగా పూర్తిచేయాలని తిరుపతి పశుసంవర్ధకశాఖ డిప్యూటి డైరెక్టర్ ఉమామహేశ్వరి అధికారులను కోరారు. ఆమె గురువారం నాయుడుపేట ఏడిప కార్యాలయంలో వెంకటగిరి, సూళ్ళురుపేట, నాయుడుపేట మండలాలకు చెందిన పశువైద్యధికారులు,ఆర్‌బికే సిబ్బందితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా డిప్యూటిడైరెక్టర్ ఉమామహేశ్వరి మాట్లడుతూ గ్రామాల్లో పశుభీమాను వేగవంతంచేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. పశువులకు రోగాలు రాకుండ ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పచికదొమ్మ, గాలికుంటువ్యాదులు తగలకుండ ముందుగా వ్యాక్సిన్ వేయించాలన్నారు. పశువుల ఆరోగ్యంపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. ఈసమావేశంలో నాయుడుపేట ఏడి గోవర్ధన్‌రెడ్డి,సూళ్ళూరుపేట ఏడి వరలక్ష్మి,వెంకటగిరి ఏడి స్వామిబాబు,వైద్యధికారులు మునికుమారి,ఆర్‌బికే సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్స్ శ్రీబాలాజి ఆరోగ్య వరప్రసాదిని పథకానికి విరాళం



తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : స్విమ్స్ ఆసుపత్రికి చెన్నైకి చెందిన సిఎంజి స్టిల్స్ ప్రై. లిమిటెడ్ కంపెనీ వారు స్విమ్స్ శ్రీ బాలాజి ఆరోగ్య వరప్రసాదిని పథకానికి రూపాయలు పది లక్షల డిడిని గురువారం స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్‌వి. కుమార్‌ని కలిసి అందజేసారు. శ్రీ వారిపై ఉన్న భక్తి విశ్వాసములతోను, స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్‌వి. కుమార్ పేద ప్రజలకు అందజేస్తున్న వైద్య సేవలకు గాను ఈ విరాళ డిడిని అందజేసినట్లు తిరుపతికి చెందిన కంపెనీ ప్రతినిధి వై. రాఘవేంద్ర తెలిపారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్‌వి కుమార్ దాత అయిన సిఎంజి స్టీల్స్ ప్రై లిమిటెడ్ కంపెనీ వారికి, డిడిని అందజేసిన వై. రాఘవేంద్రకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ విరాళాన్ని స్విమ్స్ చికిత్స పొందుతున్న పేదవారి కొరకు వినియోగిస్తామని తెలిపారు.

## పట్టు రైతుల ఉత్పాదకత పెంచడానికి రెయిన్‌బో అగ్రోవెట్‌తో ఒప్పందం



తిరుపతి మహిళావర్సిటీ, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : పట్టు రైతుల యొక్క ఉత్పాదకతను పెంపొందించే ఉత్పత్తులను ఆవిష్కరించే నిమిత్తమై శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, రెయిన్బో అగ్రోవేట్ సెరిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ గురువారం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా బయోసైన్స్ అండ్ సెరికల్చర్ విభాగంలో విస్తృత పరిశోధనలు గావించి, ఇండస్ట్రీ ద్వారా ఆ ఫలితాలు క్షేత్రస్థాయికి చేరేలా చేయడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. దీని ద్వారా రీసెర్చ్ స్కాలర్స్‌కి సామాజిక అవసరాలకు అనుగుణంగా అధ్యయనాలు చేపట్టే అవకాశం కూడా ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య భారతి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ సుజాత, రెయిన్‌బో ఆగ్రోవేట్ సెరీ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ బివి సుబ్బారాయుడు, సెరికల్చర్ విభాగాధిపతి ప్రొఫెసర్ మమత, ప్రొ. సావిత్రి, ప్రొ. విజయకుమార్ పాల్గొన్నారు.

## అక్కేరి రోడ్డు సమస్య పరిష్కారానికి మంత్రి రోజా కృషి



పుత్తూరురూరల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: పుత్తూరు రూరల్ మండలం వేపగుంట-అక్కేరి రోడ్డు సమస్యను పరిష్కరించడానికి గురువారం మంత్రి రోజా సంఘటనా స్థలాన్ని సందర్శించి దక్షిణ రైల్వే అధికారులతో సమీక్షించారు. పుత్తూరు రూరల్ మండలం వేపగుంట వద్ద రైల్వే అధికారుల మరమ్మతులతో అక్కేరి దళితవాడ ప్రజలకు రహదారి సమస్య తలెత్తింది. ప్రజల వినతులపై స్పందించిన మంత్రి రోజా గురువారం అక్కేరి దళితవాడను సందర్శించి రైల్వే అధికారులతో చర్చించారు. వేపగుంట నుంచి అక్కేరి దళితవాడ వరకు రోడ్డు, డ్రైనేజీ కాలువ ఏర్పాటుకు స్థలం మినహాయించడానికి రాష్ట్ర మంత్రి వినతి మేరకు దక్షిణ రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారు. కాగా అక్కేరి దళితవాడ రోడ్డు సమస్యను, డ్రైనేజీ కాలువ ఏర్పాటుకు స్థలం కేటాయించడానికి స్థానికులు మంత్రి రోజాకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పుత్తూరు మండల ప్రజాప్రతినిధులు, దక్షిణ రైల్వే అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరసిద్ధుని సేవలో తెలంగాణా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



కాణిపాకం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: తెలంగాణా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేపల్లె నంద కుటుంబసమేతంగా గురువారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికిఆలయ సూపరెండెంట్ కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## యథేచ్ఛగా ప్రభుత్వ భూమి ఆక్రమణ

### - అడ్డుకున్న ఎస్టీ కాలనీ వాసులు



వడమాలపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని కొందరు చదును చేస్తున్నారు. అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతోస్థానిక ఎస్టీ కాలనీ మహిళలు అడ్డుకున్నారు. ఈ సంఘటన వడమాలపేట మండలంలోని బాలి నాయుడు కండ్రిగ పంచాయతీ బంగారెడ్డి కండ్రిగ గ్రామంలోజరిగింది. సీతారామపురం రెవెన్యూ పరిధిలోని గుట్ట పొరంబోకు భూమిని ఆక్రమించుకోగా ఎస్టీ కాలనీ మహిళలు గురువారం అడ్డుకున్నారు. ఆక్రమణ భూమి వద్ద మహిళలు మీడియాతో మాట్లాడుతూ 20 రోజులుగా బంగారెడ్డి కండ్రిగ పరిసరాల్లో సుమారు 50 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమిని ఎక్సవేటర్లతో చదును చేస్తూ ఆక్రమాలకు పాల్పడుతున్నా అధికారులు పట్టించుకోలేదని, తెలిసీ తెలియనట్లు ఊరుకున్నారని ఆరోపించారు. శ్మశాన స్థలాన్ని కూడా ఆక్రమించారని ఆవేదన వ్యక్తం చేశారు. బంగారెడ్డి కండ్రిగ ఎస్టీ కాలనీలో 20 కుటుంబాలు ఉన్నాయని ఎక్సవేటర్ల రాకపోకలతో తాగునీటి పైపులు పగిలి పది రోజులుగా తాగునీళ్ల లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. 20 కుటుంబాల వాసులకు సెంటు భూమి కూడా లేదని, తమకు జీవనోపాధి కోసం ఆక్రమణలను తొలగించి పట్టాలివ్వాలని కోరారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూమి ఆక్రమణల పాలు కాకుండా కాపాడి ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## నేడు భరద్వాజ తీర్థంలో తై అమావాస్య ఉత్సవం

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : వచ్చేనెల 3 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అయితే ఇక్కడి ఆలయానికి నియమించిన ఇఓ నాగేశ్వరరావు ఇంకా బాధ్యతలు చేపట్టలేదు. ఉత్తర్వులు జారీ అయి వారం రోజులౌతున్నా ఇంకా బాధ్యతలు చేపట్టలేదు. శ్రీకాళహస్తీశ్వ రాలయంలో నిర్వహించే ఉత్సవాల్లో అత్యధిక ప్రాధాన్యత కల్గిన ఉత్సవం మహాశివరాత్రి.ఈ ఉత్సవాలను 13రోజుల పాటు బ్రహ్మోత్సవాలుగా నిర్వహించటం ఆనవాయితిగా వస్తుంది.ఈ నేపధ్యంలో ఈ నెలంతా ఆలయంలో ఉత్సవాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు.శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో తై అమావాస్య సందర్భంగా భక్తుల సందడి అధికంగా ఉంటుంది. భరద్వాజ మహాముని తపస్సు చేసిన భరద్వాజ తీర్థంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేకాభిషేకాలు, అలంకారాలు, పూజలు నిర్వహిస్తారు.ఈ ఉత్సవాన్ని స్థానికుల అత్యధిక సంఖ్యలో పాల్గొంటారు. ఏడాదిలో ఒకే ఒక రోజు లోబావిలో స్వామి అమ్మవార్లను తరలించి అక్కడ సేవలందిస్తారు. ఈ మేరకు భరద్వాజ మహర్షి పూజలు నిర్వహించిన 'భరద్వాజేశ్వరుని లింగానికి' విశేష పూజలు నిర్వహిస్తారు. తరువాత గ్రామోత్స వం నిర్వహిస్తారు. కాగా ఈనెల 16న రథ సప్తమి. ఈ ఉత్సవానికి కూడా అత్యంత ప్రాధాన్యత ఉంది. సూర్యప్రభవాహనంపై స్వామి అమ్మవార్లను గ్రామోత్సవం నిర్వహిస్తారు. కాగా 20న భీష్మఏకాదశిని నిర్వహిస్తారు. 24న పవిత్ర స్వర్ణముఖిలో ఏటి ఉత్సవాన్ని నిర్వహిస్తారు.ఇక్కడ పంచమూర్తులను తీసుకెళ్ళి పూజలు నిర్వహిస్తారు. త్రిశూల స్నానాన్ని నిర్వహిస్తారు. ఈ ఉత్సవానికి పట్టణం నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు, మహిళా భక్తులు హాజరౌతారు. ఈ నెల 25న ధోపోత్సవానికి ఏర్పాట్లు ను అధికారులు చేపట్టారు.

## నాడు నేడు పనులకు రూ.13.73కోట్లు

### -ప్లానింగ్‌కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి



తొట్టంబేడు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : నాడు నేడు రెండోవిడత పనులను పూర్తిచేసేందుకు రూ.13.73 కోట్లు మంజూరైనట్లు ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం ఆయన తొట్టంబేడు విద్యాశాఖ కార్యాలయానికి విచ్చేసి నాడునేడు పనుల పర్యవేక్షణపై ఎంఈవో భాస్కర్‌తో సమీక్షించారు. ఈసందర్భంగా ప్లానింగ్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ మండలంలోని 37 పాఠశాలలకు రెండో విడత నిధులను మంజూరు చేసిందన్నారు. మండలంలోని ఎస్వీఫ బాలికల జూనియర్ కళాశాలకు రూ.49.93 లక్షలు మంజూరు చేసిందన్నారు.జిల్లాలో మొత్తం 21 జూనియర్ కళాశాలలు ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం రూ.4.96కోట్లు విడుదల చేసిందన్నారు. నిధులు సత్వరం విడుదల చేస్తే పనులు శరవేగంగా పూర్తిచేస్తామన్నారు. గతంలో కంటే నేటి ప్రభుత్వంలో పాఠశాలలు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల కంటే దీటుగా ఏర్పాటు చేశారని దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. 9 అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మత్తులు చేసినట్లు వివరించారు. నాడు నేడు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని ప్రభుత్వం నిధుల విడుదల చేసినవెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఆయనతో పాటు ఐఈఆర్‌టి జిల్లా కోఆర్డినేటర్ సురేష్, ఎంఈవో భాస్కర్, సిఆర్‌పి మునికృష్ణారెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

## పేదలను ఇబ్బంది పెడుతున్న రెవెన్యూ అధికారులు



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసిన వారిని అరికట్టలేక పేదలకు ఇబ్బంది పెడుతున్న రెవెన్యూ అధికారులు వైఖరి మార్చుకోవాలని ప్రజలు వాపోతున్నారు. కరకంబాడి పంచాయితీలోని జగనన్న పట్టా పొందిన ప్రజలు, ఇళ్ళ స్థలాలకు అర్హులైన పేదలు గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. అయితే ఆ గుట్టకు పోవడానికి ఉన్న రహదారిని ఆర్‌డిఓ జేసిబితో పెద్ద పెద్ద గుంతలు కొట్టించడాన్ని సిపిఎం నాయకులు రాజశేఖర్ ఖండించారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్ధుల రవి సర్వే నంబర్ 153/1 నందు గల 146 రకాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని మట్టి రాళ్ల లారీ, ట్రాక్టర్‌తో తోలుకుంటుంటే అప్పుడు దారి మూసివేయాలని అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు. పేదోడు గుడిసె వేస్తే నేరస్తులుగా అధికారులు చిత్రీకరించి ఇబ్బందులు పెట్టడం సరైనది కాదని అన్నారు. అధికారులు ప్రజలు దారిలేకపోతే తాగడానికి నీళ్ల తిండి ఎలా తెచ్చుకుంటారని ప్రశ్నించారు. అలాగే కబ్జాదారుల కథ తెల్చకుండా పేదలపై మీ దురుసుతనం ఎంటి అని ప్రశ్నించారు. ప్రభుత్వ చెరువులు 4 ఆక్రమిస్తే, సిద్ధుల రవి 146 ఎకరాలు ఆక్రమిస్తే ఈ అధికారులకు కళ్ళు కనిపించాయా అని అధికారులను సూటిగా ప్రశ్నించారు.

# గంగమ్మకు వేలం పాటద్వారా రూ. 1.01కోట్ల ఆదాయం



బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : శక్తి స్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయానికి వేలం పాటద్వారా రూ. 1,01,57000 ఆదాయంగా సమ కూరినట్లు ఇఓ చంద్రమౌళి తెలిపారు. గురువారం కొండపై గల కార్యాలయంలో ఛేర్మన్ నాగరాజరెడ్డి అధ్యక్షతన వివిధ వనరులకు వేలం పాటలు జరిగాయి. కొండపై క్యాంటీన్, ఐస్‌క్రీమ్, కూల్‌డ్రింక్స్‌ను సంవత్స ర కాలం పాటు విక్రయించు కొనే హక్కును రూ. 20.10లక్షలు, దారాలు, ఫోటోలు వగైరాలను (షాపు నంబర్ 1) రూ. 17.25 లక్షలకు ఏ.గంగిరెడ్డి హెచ్చుగా పాడి దక్కించుకొన్నాడు. దారాలు, ఫోటోలు వగైరాలను (షాపునంబర్ 2)ను రూ. 12.75లక్షలకు సురేంద్ర, దారాలు, ఫోటోలు వగైరాలను (షాపు నంబర్ 3) రూ. 19.06 లక్షలకు రెడ్డెప్ప, దారాలు, ఫోటోలు వగైరాలను(షాపునంబర్ 4)కు రూ. 17.25లక్షలకు నరసింహులు, పేపరు కవర్లు, బ్యాగులు విక్రయించు కొనే హక్కును రూ. 13.10లక్షలకు ఆంజనేయులు, ఫోటోలు తీసుకొనే హక్కును రూ. 1.61లక్షలకు ప్రసాద్‌లు హెచ్చుగా పాడి దక్కించు కొన్నారు. గత సంవత్సరంతో పోల్చితే ఈ దఫా రూ. 20.63లక్షల ఆదాయం అధికంగా సమకూరిందన్నారు. కొండకింద ఐస్‌క్రీమ్, క్యాంటీన్ నిర్వహించుకొనే హక్కు, కోళ్ళు విక్రయించుకొనే హక్కు, పాదరక్షకులు భద్రపరచుకొనే హక్కు, తదితర హక్కులను వాయిదా వేసినట్లు ఇఓ వివరించారు. ధర్మకర్తల మండలి సభ్యులు రామ్‌దాస్, రాజేష్, భారతి, బుద్దమ్మ, పవన్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, హైమావతి, రెడ్డెమ్మ, లక్ష్మీదేవమ్మ చెన్నరాయుడు, ఎండోమెంట్ ఇన్స్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర పాల ఏకిరల కార్పోరేషన్ సభ్యుడు కొండపల్లి రమణ(లడ్డు), స్థానికులు పాల్గొన్నారు.